సోవియట్ పార్టీ లేఖకు

చైనా కమ్యూనిస్టు పార్టీ జవాబు

(14 జూన్. 1963)



CT

PSL01EH01

సోవియట్ పార్టీ లేఖకు

చైనా కమ్యూనిస్టు పార్టీ జవాబు

(14 జూన్ 1963)



12-11-997, బౌద్ధనగర్,
సికిందరాబాద్ - 500 361.

ప్రచురణ నెం : 51.

ప్రచురణ కాలం : ఆగస్టు '83.

యువ ప్రింటర్స్, విజయవాడ.

వెల : రూ. 1-50

ప్రతులకు :-

1) పీస్ బుక్ సెంటర్
4-5-421సుల్తాన్ బజార్,
హైదరాబాద్-500 001

2) సృజన
హనుమకొండ,
వరంగల్-506 001

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ మార్చి 30వ తేదీన వ్రాసిన లేఖకు చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ జూన్ 14వ తేదీన జవాబు ఇచ్చింది. "అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం యొక్క సాధారణ పంథాకు సంబంధించిన ప్రతిపాదన" అనే శీర్షిక క్రింద పీపుల్స్ డెయిలీ జూన్ 17వ తేదీన ఆ జవాబును ప్రచురించింది. జూన్ 15వ తేదీన సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీకి అంద జేయబడిన ఆ జవాబు పూర్తిపాఠం ఇది. (జూన్ 14, 1963)

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీకి!

ప్రియమైన కామ్రేడ్స్.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ 1963 మార్చి 30వ తేదీన వ్రాసిన లేఖను చైనా కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ పరిశీలించింది.

సోషలిస్టు శిబిరం విషయంలో, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ విషయంలో ఐక్యతను కోరేవారందరూ చైనా, సోవియట్ పార్టీల మధ్య సంప్రదింపులను గూర్చి హృదయ పూర్వకమైన, ఆసక్తిని కనబరుస్తున్నారు. అభిప్రాయ భేదాలను తొలగించుకోవడానికి, ఐక్యతను పటిష్ఠవంతం చేసుకోవడానికి, అన్ని కమ్యూనిస్టు, వర్కర్సు పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పరచడానికై తగు పరిస్థితులను కల్పించడానికి మన సంప్రదింపులు తోడ్పడగలవని ఆశిస్తున్నారు.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క ఐక్యతను నిలబెట్టుకోవడం, పటిష్ఠవంతం చేసుకోవడం అన్నిదేశాల కమ్యూనిస్టు, వర్కర్సు పార్టీల సమిష్టి కర్తవ్యం, పవిత్ర కర్తవ్యం. యావత్తు సోషలిస్టు శిబిరాన్ని అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఐక్యపరచే విషయంలో చైనా, సోవియట్ పార్టీలకు గొప్ప బాధ్యత ఉంది. అవి అందుకు తగినట్లుగానే తీవ్రమైన కృషి సలపాలి.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో నేడు సిద్ధాంతానికి సంబంధించిన ప్రధాన భేదాభిప్రాయాలు అనేకం ఉన్నాయి. అయితే ఈ భేదాభి

ప్రాయాలు ఎంత తీవ్రమైనవి అయినప్పటికి, వీటిని తొలగించుకోడానికి మనం తగినంత ఓర్పు వహించవలసి ఉంది, మార్గాలు వెతకవలసివుంది. అలా జరిగినప్పుడే మనశక్తులను కూడదీసుకొని, మన ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా పోరాటాన్ని పటిష్ఠవంతం చేసుకోగలం.

ఇలాంటి హృదయపూర్వకమైన ఆకాంక్షతోటే చైనా కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ చైనా, సోవియట్ పార్టీల మధ్య జరుగనున్న సంప్రదింపులకు సిద్ధమవుతుంది.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ మార్చి 30వ తేదీన వ్రాసిన లేఖలో, చైనా సోవియట్ పార్టీలమధ్య సంప్రదింపుల సమయంలో చర్చించవలసిన సమస్యలను గూర్చి తన దృక్పథాన్ని ఒక పద్ధతి ప్రకారం ఎదుటపెట్టింది. ముఖ్యంగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సాధారణ పంథాకు సంబంధించిన సమస్యను లేవదీసింది. ఈ లేఖలో మేముకూడా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సాధారణ పంథాను గూర్చి, అందుకు సంబంధించిన కొన్ని సిద్ధాంత సమస్యలను గూర్చి మా అభిప్రాయాలను వెల్లడించదలచుకొన్నాం.

మన ఉభయ పార్టీలు ఒకరినొకరు అవగాహన చేసుకోవడానికి, సంప్రదింపుల సమయంలో వివరంగా, ఒక అంశం తర్వాత మరో అంశం చర్చించడానికి మేము వెల్లడించిన అభిప్రాయాలు తోడ్పడగలవని ఆశిస్తున్నాము.

సోదర పార్టీలు మా అభిప్రాయాలను అవగాహన చేసుకోవడానికి, సోదరపార్టీల అంతర్జాతీయ సమావేశంలో ఒకరి అభిప్రాయాలు ఒకరికి పూర్తిగా తెలుపుకోవడానికి ఇది తోడ్పడగలదని కూడా మేము ఆశిస్తున్నాము.

(1) కార్మికవర్గంయొక్క చరిత్రాత్మకమైన ప్రయోజనాన్ని గూర్చి మార్క్సిస్టు-లెనినిస్టు విప్లవ సిద్ధాంతాన్ని అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సాదారణ పంథా తనకు మార్గదర్శకమైన సిద్ధాంతంగా తీసుకోవాలి. దానినుండి వేరు కాకూడదు.

1957, 1960 మాస్కో సమావేశాలలో ఒకరి అభిప్రాయాలు ఒకరికి

పూర్తిగా తెలుపుకొన్న తర్వాతనే డిక్లరేషన్-స్టేట్‌మెంట్ ఆమోదించాయి. సంప్రదింపుల ద్వారా ఏకాభిప్రాయాన్ని సాధించాలన్న సూత్రానికి అనుగుణ్యంగానే ఆ విధంగా జరిగింది. ఆ రెండు పత్రాలు మన యుగ లక్షణాలను, సోషలిస్టు విప్లవంయొక్క ఉమ్మడి సూత్రాలను పేర్కొంటున్నాయి. అన్ని కమ్యూనిస్టు, వర్కర్సు పార్టీలకు ఉమ్మడిపంథాను సూచిస్తున్నాయి. అవి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి ఉమ్మడి కార్యక్రమము.

1957, 1960 డిక్లరేషన్-స్టేట్‌మెంట్‌లను అవగాహన చేసుకొనే విషయంలోనేమి, వాటిపట్ల తీసుకోవలసిన వైఖరి విషయంలోనేమి కొద్ది సంవత్సరాలుగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో భేదాభిప్రాయాలు ఉన్నమాట నిజమే. డిక్లరేషన్-స్టేట్‌మెంట్‌లలోని విప్లవ సూత్రాలను అంగీకరించడమా లేదా అనేదే ఇక్కడ ప్రధానమైన సమస్య. గత పరిశీలనలో, మార్క్సిజం-లెనినిజంయొక్క విశ్వజనీన సత్యాన్ని అంగీకరించడమా లేదా అనేది సమస్య. అక్టోబరు విప్లవంయొక్క విశ్వజనీన ప్రాధాన్యతను గుర్తించడమా లేదా అనేది సమస్య. ప్రపంచ జనాభాలో మూడింట రెండువంతుల ప్రజలు నేటికీ సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ వ్యవస్థ కింద జీవిస్తున్నారు. వారు విప్లవం లేవదీయవలసి ఉందనే వాస్తవాన్ని అంగీకరించడమా లేదా అనేది సమస్య. ప్రపంచ జనాభాలో మూడింట ఒకవంతుగా ఉంటూ, ఇప్పటికే సోషలిస్టు మార్గంలో పయనిస్తున్న ప్రజలు తమ విప్లవాన్ని చివరికంటా పరిపూర్తి చేసుకోవలసి ఉందనే వాస్తవాన్ని అంగీకరించడమా లేదా అనేది సమస్య.

1957, 1960 డిక్లరేషన్-స్టేట్‌మెంట్‌లలో పొందుపరచిన విప్లవసూత్రాలను దృఢంగా కాపాడుకోవడం నేడు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క అత్యవసరమైన, ప్రధానమైన కర్తవ్యంగా తయారైంది.

మార్క్సిజం-లెనినిజం యొక్క విప్లవ బోధలను, అక్టోబరు విప్లవం యొక్క సాధారణ పంథాను ఖచ్చితంగా అనుసరించడం ద్వారానే డిక్లరేషన్-స్టేట్‌మెంట్‌లలోని విప్లవ సూత్రాలను సరిగా అవగాహన చేసుకోవడానికి, వాటిపట్ల సరిఅయిన వైఖరి అవలంభించడానికి వీలు అవుతుంది.

(2) డిక్లరేషన్, స్టేట్‌మెంట్‌లలోని విప్లవ సూత్రాలు ఏవి? వాటిని ఈ దిగువ విధంగా క్లుప్తీకరించవచ్చు:

ప్రపంచ కార్మికులు ఏకంకావాలి; ప్రపంచకార్మికులు, పీడితప్రజలతో, పీడిత జాతులతో ఏకంకావాలి; అన్ని దేశాలలోను సామ్రాజ్యవాదాన్ని, అభివృద్ధి నిరోధక శక్తులను ఎదిరించాలి; ప్రపంచశాంతి, జాతీయ విముక్తి, ప్రజాస్వామ్యం, సోషలిజాలకోసం కృషిచేయాలి; సోషలిస్టు శిబిరాన్ని పటిష్ఠంచేసి, విస్తృతం చేయాలి; కార్మికవర్గ ప్రపంచ విప్లవం క్రమక్రమంగా సంపూర్ణ విజయం పొందేట్లు చేయాలి; సామ్రాజ్యవాదమూ, పెట్టుబడిదారీ విధానమూ, మానవుని మానవుడు దోచుకొనే పద్ధతిలేని నూతన ప్రపంచాన్ని స్థాపించాలి.

ఇది ప్రస్తుత దశలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క సాధారణ పంథా అని మా అభిప్రాయం.

(3) ప్రపంచ వాస్తవ పరిస్థితిని మొత్తంగా గమనించినప్పుడు సమకాలిక ప్రపంచంలో మౌలిక వైరుధ్యాలను వర్గ దృక్పథం నుంచి పరిశీలించినపుడు ఈ సాధారణ పంథా రూపొందుతుంది. అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ వ్యాప్తంగా రూపొందించిన విప్లవ ప్రతీఘాత వ్యూహానికి వ్యతిరేకంగా ఇది ఉద్దేశింపబడింది.

ఈ సాధారణ పంథా విస్తృతమైన ఐక్య సంఘటనను ఏర్పాటు చేసేదిగా ఉంటుంది. సోషలిస్టు శిబిరం, ప్రపంచ కార్మికవర్గం దీనికి ప్రాతిపదికగా ఉంటాయి. అమెరికా నాయకత్వానగల సామ్రాజ్యవాదులను, అభివృద్ధి నిరోధకులను వ్యతిరేకించడం దీని ఉద్దేశం. ప్రజానీకాన్ని పెద్ద ఎత్తున కదలించే పంథా యిది. విప్లవ శక్తులను విస్తృతపరచే పంథా యిది. మధ్యమ శక్తులను తనవైపు ఆకర్షిస్తూ, అభివృద్ధి నిరోధక శక్తులను వేరుపరచే పంథా యిది.

ఈ సాధారణ పంథా అన్నిదేశాల ప్రజలు స్థిరసంకల్పముతో విప్లవ పోరాటం నడిపేదిగా, కార్మికవర్గ ప్రపంచ విప్లవాన్ని చివరికంటా తీసుకు

పోయేదిగా ఉంటుంది. ధృఢంగా సామ్రాజ్యవాదాన్ని రూపుమాపి, ప్రపంచ శాంతిని పరిరక్షించే పంథా ఇది.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క సాధారణ పంథాను ఏకపక్షంగా "శాంతియుత సహజీవనం," "శాంతియుత పోటీ," "శాంతి యుత పరివర్తన"ల కిందికి దిగజార్చడమంటే, 1957 డిక్లరేషన్‌ను 1960 స్టేట్‌మెంట్‌లోని విప్లవ సూత్రాలను కాదనడమే అవుతుంది. కార్మికవర్గ ప్రపంచ విప్లవంయొక్క చరిత్రాత్మక ప్రయోజనానికి తిలోదకాలివ్వడమే అవుతుంది. మార్క్సిజం-లెనినిజం యొక్క విప్లవ బోధనల నుండి దూరం కావడమే అవుతుంది.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క సాధారణ పంథా, ప్రపంచ చారిత్రక పరిణామం యొక్క సాధారణ నియమాన్ని ప్రతిబింబించాలి. వివిధ దేశాలలోని కార్మికవర్గయొక్క, ప్రజలయొక్క విప్లవ పోరాటాలు వేర్వేరు దశలలో సాగుతాయి. వాటన్నిటికీ ప్రత్యేక స్వరూప స్వభావాలు ఉంటాయి. అయితే అవి ప్రపంచ చారిత్రక పరిణామంయొక్క సాధారణ నియమాన్ని దాటిపోలేవు. సాధారణ పంథా అన్ని దేశాల కార్మికవర్గం యొక్క, ప్రజలయొక్క విప్లవ పోరాటాలకు మౌలికమైన మార్గాన్ని చూపెట్టాలి.

ప్రతి కమ్యూనిస్టు, లేక వర్కర్స్ పార్టీ తన నిర్దిష్టమైన పంథాను విధానాలను రూపొందించుకొంటూనే, తన స్వదేశంలో నిర్దిష్టమైన విప్లవాచరణతోను, నిర్మాణంతోను మార్క్సిజం-లెనినిజం యొక్క విశ్వజనీన సత్యాన్ని జోడించి చూచే సూత్రానికి కట్టుబడివుండటం చాలా అవసరం.

(4) అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క సాధారణ పంథాను నిర్వచించడంలో, మొత్తంమీద ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక పరిస్థితులను, ప్రపంచ వాస్తవిక పరిస్థితులను, అంటే సమకాలిక ప్రపంచంలో మౌలిక (ఫండమెంటల్) వైరుధ్యాలను నిర్దిష్ట వర్గపరిశీలన చేయడంతో ప్రారంభించాలి.

నిర్దిష్ట వర్గపరిశీలనను వదిలిపెడితే, ఒక విధంగా శూన్యంలో తడవులాడుకొన్నట్లు అవుతుంది. స్వీయమానసికమైన, నిరాధారమైన నిర్ణయాలు

చేయబడతాయి. అందుచేత, అంతర్జాతీయ కమ్యూనిసు ఉద్యమం యొక్క సాధారణ పంథానుగూర్చి సరి అయిన నిర్ణయాలకు రాలేకపోవడం అటుంచి, మార్క్సిజం-లెనినిజానికి పూర్తి భిన్నమైన దారి తొక్కడం అనివార్యమవుతుంది.

సమకాలిక ప్రపంచంలో ప్రధానమైన వైరుధ్యాలు ఏవి? మార్క్సిస్టు లెనినిస్టులు ఖచ్చితంగా పేర్కొనే వైరుధ్యాలు ఇవి.

సోషలిస్టు శిబిరానికి, సామ్రాజ్యవాద శిబిరానికి మధ్య వైరుధ్యం;

పెట్టుబడిదారీ దేశాలలో కార్మికవర్గానికి, బూర్జువా వర్గానికి మధ్య వైరుధ్యం;

పీడితజాతులకు, సామ్రాజ్యవాదానికి మధ్య వైరుధ్యం;

సామ్రాజ్యవాద దేశాలమధ్య, గుత్త పెట్టుబడిదారీ గ్రూపుల మధ్య వైరుధ్యాలు.

సోషలిస్టు శిబిరానికి, సామ్రాజ్యవాద శిబిరానికి మధ్య వైరుధ్యం మౌలికంగానే భిన్నమైన రెండు సామాజిక వ్యవస్థలు, అంటే సోషలిజం, పెట్టుబడిదారీ విధానం మధ్య వైరుధ్యం. ఇది తీవ్రమైనదనటంలో సందేహంలేదు. అయితే మార్క్సిస్టు-లెనినిస్టులు ప్రపంచంలోని వైరుధ్యాలను కేవలం సోషలిస్టు శిబిరం, సామ్రాజ్యవాద శిబిరం మధ్య ఉన్న వైరుధ్యంగా మాత్రమే లెక్కించకూడదు.

అంతర్జాతీయ శక్తుల బలాబలాలలో మార్పు వచ్చింది. ఇది సోషలిజానికి, ప్రపంచంలోని పీడిత ప్రజలందరికి, పీడిత దేశాలన్నిటికి చాలా అనుకూలంగాను, సామ్రాజ్యవాదానికి, అన్ని దేశాలలోని అభివృద్ధి నిరోధక శక్తులకు చాలా వ్యతిరేకంగాను తయారైంది. అయినప్పటికి, పైన పేర్కొన్న వైరుధ్యాలు వాస్తవంగా నేటికీ ఉన్నాయి.

ఈ వైరుధ్యాలు, తత్ఫలితంగా ఏర్పడే పోరాటాలు విడదీయరాని సంబంధం కలిగి, ఒకదానినొకటి ప్రభావితం చేస్తాయి. ఈ మౌలికమైన వైరుధ్యాలలో ఏ ఒక్కదానిని ఎవరూ తుడిచివేయజాలరు. లేదా స్వీయాత్మకంగా తక్కిన అన్నిటి స్థానంలో ఏ ఒక్కదానిని నిలబెట్టజాలరు.

ఈ వైరుధ్యాలు ప్రజావిప్లవాలకు దారితీయడం అనివార్యం. ప్రజా విప్లవాలు మాత్రమే వీటిని పరిష్కరించగలవు.

(5) సమకాలిక ప్రపంచంలో మౌలికమైన వైరుధ్యాల విషయంలో ఈ దిగువ పేర్కొన్న తప్పు అభిప్రాయాలను విడనాడవలసి ఉంది.

అ) సోషలిస్టు, సామ్రాజ్యవాద శిబిరాల మధ్య వైరుధ్యంలో, వర్గ విషయాన్ని తుడిచివేస్తున్న దృక్పథం కార్మికవర్గ నియంతృత్వం కిందగల దేశాలకు, గుత్త పెట్టుబడిదారీ నియంతృత్వం కిందగల దేశాలకు మధ్య వుండే ఈ వైరుధ్యాన్ని చూడటంలో విఫలమవుతున్న దృక్పథం.

ఆ) సోషలిస్టు సామ్రాజ్యవాద శిబిరాలమధ్య వైరుధ్యాన్ని మాత్రమే గుర్తిస్తున్న దృక్పథం, మరోవైపున పెట్టుబడిదారీ ప్రపంచంలో కార్మిక వర్గానికి, బూర్జువా వర్గానికి మధ్య, పీడితజాతులకు, సామ్రాజ్యవాదానికి మధ్యగల వైరుధ్యాలను, వీటి ఫలితంగా జరిగే పోరాటాలను ఇది నిర్లక్ష్యమైనా చేస్తుంది, తక్కువ అంచనా అయినా వేస్తుంది.

ఇ) పెట్టుబడిదారీ ప్రపంచానికి సంబంధించిన ప్రతిదేశంలోను కార్మిక వర్గానికి, బూర్జువావర్గానికి మధ్యగల వైరుధ్యాన్ని, కార్మికవర్గ విప్లవం లేకుండానే పరిష్కరించవచ్చునని, పీడితజాతులకు, సామ్రాజ్యవాదానికి మధ్యగల వైరుధ్యాన్ని, విప్లవం లేకుండానే పరిష్కరించుకోగలవని వాదించే దృక్పథం.

ఈ) సమకాలిక ప్రపంచలోని అంతర్గత వైరుధ్యాలు ఒక నూతన పరిస్థితికి దారితీయడం అనివార్యమని, సామ్రాజ్యవాద దేశాలు ఒక తీవ్ర పోరాటంలో బంధింపబడిన పరిస్థితి ఇది అనే విషయాన్ని నిరాకరిస్తూ, "బడా గుత్త పెట్టుబడిదారీ వర్గాలమధ్య అంతర్జాతీయ ఒప్పందాల" ద్వారా సామ్రాజ్యవాద దేశాలమధ్య వైరుధ్యాలకు రాజీ కుదరగలదని, లేదా రూపు మాపబడగలవని ఉల్లిగుద్దినట్లు చెప్పే దృక్పథాన్ని విడనాడాలి.

ఉ) సోషలిజం, పెట్టుబడిదారీ విధానం అనే రెండు ప్రపంచ వ్యవస్థల మధ్యగల వైరుధ్యం "ఆర్థిక పోటీ" దశలో తనకు తానే అదృశ్యమై పోతుందని, ఈ రెండు వ్యవస్థల మధ్యగల వైరుధ్యం మాయం కావడంతో

ప్రపంచములో మౌలికమైన ఇతర వైరుధ్యాలు కూడా ఆ విధంగానే అవుతాయని, "యుద్ధాలు లేని ప్రపంచం," "సమగ్ర సహకారం" గల ఒక నూతన ప్రపంచం ఏర్పడుతుందని వాదించే దృక్పథాన్ని విడనాడాలి.

ఈ తప్పు దృక్పథాలు తప్పు విధానాలకు, హానికరమైన విధానాలకు తప్పనిసరిగా దారితీస్తాయనేది, ఈ విధంగా ప్రజానీకానికి, సోషలిజానికి ఏదోరకమైన అపజయాలు, నష్టాలు కలుగుతాయనేది స్పష్టం.

(6) రెండవ ప్రపంచ యుద్ధానంతరం సామ్రాజ్యవాదం, సోషలిజాల మధ్య బలాబలాలలో మౌలికమైన మార్పు వచ్చింది. ఈమార్పు ముఖ్యంగా ఎక్కడ కనిపిస్తుందంటే; ఇప్పుడు ప్రపంచంలో ఒక్క సోషలిస్టు దేశమే కాదు బలోపేతమైన సోషలిస్టు శిబిరంగా ఏర్పడ్డ అనేక సోషలిస్టు దేశాలు ఉన్నాయి. ఇప్పుడు సోషలిస్టు పంథాను చేబట్టిన ప్రజలసంఖ్య ఇరవై కోట్లే కాదు. వందకోట్లు లేదా ప్రపంచ జనాభాలో మూడోవంతుగా వుంది.

అంతర్జాతీయ కార్మికవర్గము, శ్రామిక ప్రజానీకము నడిపిన పోరాటాల ఫలితమే సోషలిస్టు శిబిరం. అది అంతర్జాతీయ కార్మికవర్గానికి, శ్రామిక ప్రజానీకానికి, అదే విధంగా సోషలిస్టు దేశాలలోని ప్రజానీకానికి చెందుతుంది.

సోషలిస్టు దేశంలోని ప్రజలయొక్క అంతర్జాతీయ కార్మికవర్గం యొక్క శ్రామిక ప్రజానీకంయొక్క ప్రధానమైన ఉమ్మడి కోర్కెలు ఏవంటే, సోషలిస్టు శిబిరములోని అన్ని కమ్యూనిస్టు వర్కర్సు పార్టీలు:- మార్క్సిస్టు లెనినిస్టు పంథాకు కట్టుబడివుంటూ, జాతీయంగా, అంతర్జాతీయంగా ఖచ్చితమైన మార్క్సిస్టు-లెనినిస్టు విధానాలను అమలు జరపాలి;

—కార్మికవర్గ నాయకత్వాన కార్మికవర్గ నియంతృత్వాన్ని, కార్మిక-కర్షక ఐక్యతను పటిష్ఠం చేయాలి. సోషలిస్టు విప్లవాన్ని ఆర్థిక, రాజకీయ, సిద్ధాంత రంగాలలో చివరికంటా కొనసాగించాలి.

—ప్రజాబాహుళ్యంయొక్క చొరవను, సృజనాత్మక శక్తిని ప్రోత్సహించాలి. ప్రణాళికాబద్ధమైన పద్ధతిలో సోషలిస్టు నిర్మాణాన్ని అమలు

జరపాలి. ఉత్పత్తిని అభివృద్ధి చేయాలి. ప్రజల జీవనాన్ని మెరుగు పర చాలి. దేశరక్షణను పటిష్ఠం చేయాలి;

—మార్క్సిజం-లెనినిజం ప్రాతిపదికపై సోషలిస్టు శిబిరం యొక్క ఐక్యతను పటిష్ఠం చేయాలి. కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రం ప్రాతి పదికపై ఇతర సోషలిస్టు దేశాలను బలపరచాలి;

—సామ్రాజ్యవాదుల దురాక్రమణ, యుద్ధ విధానాలను వ్యతిరే కించాలి, ప్రపంచ శాంతిని బలపరచాలి;

—అన్ని దేశాలలో అభివృద్ధి నిరోధకులు అమలు జరిపే కమ్యూనిస్టు వ్యతిరేక, ప్రజావ్యతిరేక, విప్లవ ప్రతిఘాతక విధానాలను వ్యతిరేకించాలి;

—ప్రపంచంలోని పీడితవర్గాల, పీడితజాతుల విప్లవ పోరాటాలకు తోడ్పడాలి.

ఈ కోర్కెలను తీర్చవలసిన బాధ్యత సోషలిస్టు శిబిరంలోని అన్ని కమ్యూనిస్టు, వర్కర్సు పార్టీలపైన వున్నది. తమ దేశప్రజలపట్ల, అంత ర్జాతీయ కార్మికవర్గం, శ్రామిక ప్రజానీకంపట్ల నిర్వర్తించవలసిన కర్తవ్యం అది.

ఈ కోర్కెలను నెరవేర్చడంద్వారా సోషలిస్టు శిబిరం మానవచరిత్ర గమనంపై ఒక నిశ్చయాత్మకమైన ముద్ర వేయగలదు.

ఈ కారణం చేతనే, సామ్రాజ్యవాదులు, అభివృద్ధి నిరోధకులు సోష లిస్టు శిబిరంలోని దేశాల జాతీయ, విదేశాంగ విధానాలను అడ్డుకొట్టి, సోషలిస్టు శిబిరాన్ని బలహీనపరచడానికి, సోషలిస్టు దేశాల ఐక్యతను, ముఖ్యంగా చైనా, సోవియట్ యూనియన్‌ల ఐక్యతను భగ్నం చేయడా నికి పలురకాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. సోషలిస్టు దేశాలను చీల్చ డానికి విచ్ఛిన్నపరచడానికి నిర్విరామంగా కృషిచేస్తున్నారు. చివరకి సోషలిస్టు శిబిరాన్ని రూపుమాపాలనే గొంతెమ్మ కోర్కెనుకూడా వెలి బుచ్చుతున్నారు.

సోషలిస్టు శిబిరంపట్ల సరి అయిన వైఖరి ఏమిటనే సమస్య అన్ని కమ్యూనిస్టు, వర్కర్సు పార్టీలను ఎదుర్కొంటున్న అతి ప్రధానమైన సిద్ధాంత సమస్య.

ప్రస్తుతం కమ్యూనిస్టు, వర్కర్సు పార్టీలు నూతన చారిత్రక పరిస్థితులలో శ్రామికవర్గ అంతర్జాతీయ ఐక్యత, పోరాట కర్తవ్యాన్ని కొనసాగిస్తున్నాయి. ఒకే ఒక సోషలిస్టు దేశం ఉన్నప్పుడు, ఈదేశం దృఢంగా నిలబడి సరిఅయిన మార్క్సిస్టు-లెనినిస్టు పంథాను, విధానాలను అనుసరిస్తున్నందువల్ల శత్రుత్వాన్ని, సామ్రాజ్యవాదులు, అభివృద్ధి నిరోధకులందరి ద్వారా ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నప్పుడు, ఈ ఒకే ఒక సోషలిస్టు దేశాన్ని తు.చ. తప్పకుండా బలపరచడమా లేదా అనేది కార్మిక వర్గ అంతర్జాతీయతా సూత్రాన్ని పాటించే ప్రతి కమ్యూనిస్టు పార్టీకి గీటురాయిగా ఉండేది. ఇప్పుడు పదమూడు దేశాలతో కూడిన సోషలిస్టుశిబిరం ఏర్పడింది. ఆ దేశాలు ఏవంటే అల్బేనియా, బల్గేరియా, చైనా, క్యూబా, జెకొస్లొవేకియా, జర్మనీ ప్రజాస్వామిక రిపబ్లిక్, హంగరీ, కొరియా ప్రజాస్వామిక రిపబ్లిక్, మంగోలియా, పోలెండ్, రుమేనియా, సోవియట్ యూనియన్, వియత్నాం ప్రజాస్వామిక రిపబ్లిక్. ఈ పరిస్థితులలో, కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రాన్ని పాటించే ప్రతి కమ్యూనిస్టుపార్టీకి గీటురాయి ఏదంటే, అది మొత్తం సోషలిస్టు శిబిరాన్ని బలపరుస్తున్నదా లేదా అనేదే. మార్క్సిజం-లెనినిజం ప్రాతిపదికపై, ఆ శిబిరంలోని అన్ని దేశాల ఐక్యతను కాపాడటానికి నిర్విరామకృషి చేస్తున్నదా లేదా అనేదే. సోషలిస్టు దేశాలు అనుసరింపదగిన మార్క్సిస్టు-లెనినిస్టు పంథాను, విధానాలను బలపరుస్తున్నదా లేదా అనేదే.

ఎవరైనా సరి అయిన మార్క్సిస్టు-లెనినిస్టు పంథాను, విధానాలను అనుసరించకుండా ఉన్నట్లయితే, సోషలిస్టు శిబిరంయొక్క ఐక్యతను కాపాడకుండా, పై పెచ్చు దానిలో ఉద్రిక్తతను చీలికలను సృష్టిస్తున్నట్లయితే, లేదా యుగోస్లోవ్ రివిజనిస్టుల విధానాలను సైతం అనుసరిస్తున్నట్లయితే, సోషలిస్టు శిబిరాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లయితే, లేదా సోదర సోషలిస్టు దేశాలను ఎదిరించే నిమిత్తం పెట్టుబడిదారీ దేశాలకు తోడ్పడుతున్నట్లయితే, అతడు యావత్తు అంతర్జాతీయ కార్మికవర్గం యొక్క, ప్రపంచ ప్రజలయొక్క ప్రయోజనాలకు ద్రోహం చేస్తున్నట్లే.

ఎవరైనా ఇతరుల అడుగుజాడలలో నడుస్తూ, సోషలిస్టు దేశాలు అనుసరించదగ్గ సరి అయిన మార్క్సిస్టు-లెనినిస్టు పంథాను, విధానాలను బలపరిచే బదులు, ఏదో ఒక సోషలిస్టు దేశం అనుసరించే తప్పుడు అవకాశ వాద పంథాను, విధానాలను బలపరుస్తున్నట్లయితే, ఐక్యతా విధానాన్ని బలపరిచే బదులు చీలికతెచ్చిపెట్టే విధానాన్ని బలపరుస్తున్నట్ల యితే అతడు మార్క్సిజం - లెనినిజానికి కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రానికి దూరమైపోతున్నట్లే.

(7)రెండవ ప్రపంచయుద్ధానంతరం ఏర్పడిన పరిస్థితిని అవకాశంగా తీసుకొని, అమెరికా సామ్రాజ్యవాదులు జర్మన్, ఇటాలియన్, జపాన్ ఫాసిస్టుల అడుగుజాడలలో నడిచారు. కని విని ఎరుగని విధంగా సువిశాలమైన ప్రపంచ సామ్రాజ్యాన్ని స్థాపించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. వ్యూహం రీత్యా అమెరికా సామ్రాజ్యవాదం యొక్క లక్ష్యాలు ఏవంటే; అమెరికాకు సోషలిస్టు శిబిరానికి మధ్యనున్న ప్రాంతాన్నిలాక్కొని, దానిపై పెత్తనం చెలాయించడం, పీడిత ప్రజలు, దేశాలు సాగించే విప్లవాలను అణచిపార వేయడం, సోషలిస్టు దేశాలను నాశనం చేయడానికి ఉపక్రమించడం, ఈ విధంగా ప్రపంచంలోని అన్ని జాతులను, తన మిత్రదేశాలతో సహా ప్రపంచంలోని అన్ని దేశాలను అమెరికా గుత్తపెట్టుబడిదారీ పెత్తనానికి, బానిసత్వానికి గురిచేయడం.

రెండవ ప్రపంచయుద్ధ కాలంనుండే అమెరికా సామ్రాజ్యవాదులు సోవియట్ యూనియన్‌కు, సోషలిస్టు శిబిరానికి వ్యతిరేకంగా యుద్ధ ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారం రెండు విధాలుగా ఉంది. అమెరికా సామ్రాజ్యవాదులు వాస్తవంలో ఇలాంటి యుద్ధానికి సన్నాహాలుచేస్తూనే, అమెరికా ప్రజలను పీడించడానికి, తక్కిన పెట్టుబడిదారీ ప్రపంచానికి వ్యతిరేకంగా తమ దురాక్రమణను విస్తృతపరచుకోవడానికి ఈ ప్రచారాన్ని ఒక సాధనంగా కూడా ఉపయోగిస్తున్నారు.

1960 స్టేట్‌మెంట్ ఈ దిగువ విధంగా పేర్కొంటున్నది :

"అమెరికా సామ్రాజ్యవాదం అంతర్జాతీయంగా అన్నిటికంటె పెద్ద దోపిడీదారుగా తయారైంది."

"నేడు వలస పెత్తందారీ విధానానికి అమెరికా మూలవిరాట్టుగా ఉంది."

"దురాక్రమణకు, యుద్ధానికి అమెరికా సామ్రాజ్యవాదం ప్రధాన శక్తిగా ఉంది."

"ప్రపంచ అభివృద్ధి నిరోధకత్వానికి ప్రధానమైన ఆటపట్టు అనీ అంతర్జాతీయ పోలీసుదళమని, మొత్తం ప్రపంచజాతుల శత్రువుగా తయారైందనే వాస్తవాన్ని ఇటీవల కాలంలో జరిగిన అంతర్జాతీయ పరిణామాలు కొత్తగా అనేక రుజువులద్వారా తెలియజేశాయి."

అమెరికా సామ్రాజ్యవాదం తన దురాక్రమణ, యుద్ధ విధానాలను ప్రపంచమంతటా రుద్దుతున్నది. అయితే ఆశించినదానికి వ్యతిరేకమైన ఫలితమేలభిస్తుంది. పర్యవసానం ఏమవుతుందంటే, ఇది అన్ని దేశాలలోని ప్రజల కళ్ళుతెరిపించి, వారి విప్లవాలను త్వరితం చేస్తుంది.

అమెరికా సామ్రాజ్యవాదులు ఇలా ప్రపంచ ప్రజలందరికి ప్రత్యర్థులు అయినారు. వారిచేత చుట్టివేయబడినారు. అంతర్జాతీయ కార్మికవర్గం తాను ఐక్యపరచగల శక్తులన్నిటిని ఐక్యపరచాలి. ఐక్యపరచగలదు. శత్రు శిబిరంలో అంతర్గత వైరుధ్యాలను ఉపయోగించుకోవాలి. అమెరికా సామ్రాజ్యవాదులకు వారితొత్తులకు వ్యతిరేకంగా విశాలమైన ఐక్యసంఘటనను నిర్మించాలి.

ప్రజలయొక్క మానవజాతియొక్క భవిష్యత్తును ప్రపంచ కార్మిక వర్గ ఐక్యతకు, పోరాటానికి, అన్నిదేశాల ప్రజల ఐక్యతకు, పోరాటానికి వదలిపెట్టడమే వాస్తవమైన, సరైన పద్ధతి.

అలా కాకుండా, శత్రువులకు, స్నేహితులకు మనకుమధ్య తేడా చూడకపోవడం, ప్రజలయొక్క, మానవజాతియొక్క భవిష్యత్‌ను అమెరికా సామ్రాజ్యవాదంతో మిలాఖత్ కావడానికి ఫణంగాపెట్టడమంటే ప్రజలను పెడదారి పట్టించడమే అవుతుంది.

(8) సమకాలిక ప్రపంచంలో వివిధరకాలైన వైరుధ్యాలు సువిశాలమైన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రాంతాలలో కేంద్రీకరింపబడి ఉన్నాయి; సామ్రాజ్యవాద పరిపాలనకింద ఉన్న ఈ ప్రాంతాలు విప్లవ

ప్రజ్వలనకు గొప్ప అనుకూలంగా ఉన్నాయి. సామ్రాజ్యవాదాన్ని ప్రత్య క్షంగా దెబ్బతీస్తున్న ప్రపంచ విప్లవ తుఫాను కేంద్రాలు.

ఈ ప్రాంతాలలో జాతీయ ప్రజాస్వామిక విప్లవోద్యమం, అంతర్జాతీయ సోషలిస్టు విప్లవోద్యమం మన యుగంలో చరిత్రాత్మకమైన రెండు మహాప్రవాహాలు.

ఈ ప్రాంతాలలో జాతీయ ప్రజాస్వామిక విప్లవం సమకాలిక కార్మిక వర్గ ప్రపంచ విప్లవంలో ప్రధానమైన భాగంగా ఉంది.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవపోరాటాలు పాత, కొత్త సామ్రాజ్యవాద వలస పెత్తందారీ పరిపాలనయొక్క పునాదులను పెకలించి వేస్తున్నాయి. ఈ పోరాటాలు ప్రస్తుతం ప్రపంచశాంతి రక్షణలో ఒక బలమైన శక్తిగా ఉన్నాయి.

కాబట్టి, ఒక విధంగా అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవలక్ష్యం మొత్తం ఈ ప్రాంతాలలోని ప్రజల విప్లవ పోరాటాల ఫలితంపై ఆధారపడి ఉంది. ప్రపపంచ జనాభాలో అధిక సంఖ్యాకులు నివసించే ప్రాంతాలు ఇవి.

కాబట్టి, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలోని ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవ పోరాటం కేవలం ప్రాదేశిక ప్రాధాన్యతగల విషయం కానేకాదు. పైపెచ్చు కార్మికవర్గ ప్రపంచ విప్లవ లక్ష్యానికంతటికీ సర్వ విధాల ప్రాధాన్యతగల విషయం.

ప్రస్తుతం కొందరువ్యక్తులు ఎంతవరకు వెళ్ళుతున్నారంటే, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవ పోరాటాలు అంతర్జాతీయంగా చాలా ప్రాధాన్యతకలిగి ఉన్నాయనే విషయాన్ని వారు నిరాకరిస్తున్నారు. జాతీయత అనే అడ్డుగోడలను, వర్ణవివక్షణను, భౌగోళిక హద్దులను నిర్మూలించే నెపంతో, పీడక, పీడిత జాతుల మధ్య, పీడక,పీడిత దేశాలమధ్య గీచిన ఎల్లలను తుడిచివేయడానికి, ఈ ప్రాంతాల లోని ప్రజల విప్లవ పోరాటాలపై చన్నీళ్ళు చల్లడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. వాస్తవంలో, వారు సామ్రాజ్యవాద ప్రయోజనాలకు తోడ్పడుతున్నారు.

ఈ ప్రాంతాలలో సామ్రాజ్యవాద పరిపాలన న్యాయమైనదేననిపించ

డానికి, దాని పాత, కొత్త వలస పెత్తందారీ విధానాలను ప్రోత్సహించడానికి ఒక కొత్త "సిద్ధాంతాన్ని" సృష్టిస్తున్నారు. నిజంగా, ఈ "సిద్ధాంతం" యొక్క ఉద్దేశం జాతీయత అనే అడ్డుగోడలను, వర్ణ విచక్షణను, భౌగోళిక హద్దులను రూపుమాపడం కాదు. "ఉన్నత జాతుల" పరిపాలన పీడితజాతులపై కొనసాగేట్లు చేయడమే దీని ఉద్దేశం. ఈ ప్రాంతాలలోని ప్రజలు ఈ తప్పు "సిద్ధాంతాన్ని" త్రోసిపుచ్చడం సహజంగానే జరిగింది.

ప్రతి సోషలిస్టు దేశం, ప్రతి పెట్టుబడిదారీ దేశంలోని కార్మికవర్గ చిత్తశుద్ధితో "అన్ని దేశాల కార్మికులారా ఏకంకండి," "ప్రపంచ కార్మికులారా, పీడితజాతులారా, ఏకంకండి" అనే పోరాట నినాదాలను అమలులో పెట్టాలి; ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రజల విప్లవానుభవాన్ని అధ్యయనం చేయాలి. వారి విప్లవ పోరాటాలను బలపరచాలి. వారి విముక్తి పైననే తన విముక్తి ఆధారపడి ఉన్నదన్న విషయాన్ని ప్రత్యక్షంగా తన ప్రయోజనాలకు అనుగుణమైనదిగాను లెక్కించాలి. జాతీయత అనే అడ్డుగోడలను, వర్ణవిచక్షణను, భౌగోళిక హద్దులను రూపుమాపడానికి ఆచరణ సాధ్యమైన ఏకైక మార్గం ఇదే. నిజమైన కార్మికవర్గ ఏకైక అంతర్జాతీయతా సూత్రం ఇదే.

యూరపు, అమెరికా పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికవర్గం తాను పీడితజాతులతో ఐక్యమైతే తప్ప, ఆ జాతులు విముక్తిపొందితే తప్ప, తాను స్వయంగా విముక్తిపొందడం అసాధ్యం. లెనిన్ ఎంతో చక్కగా చెప్పాడు. "పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో యూరపు, అమెరికా కార్మికులు, పెట్టుబడిదారీ విధానం ద్వారా పీడింపబడే కోట్లాది 'వలస' బానిసలతో 'సన్నిహితంగా' సంపూర్ణంగా ఐక్యంకాకపోతే, అభివృద్ధిపొందిన దేశాలలో విప్లవోద్యమం నిజంగా ఒక కపట నాటకం అవుతుంది." ("కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ద్వితీయ సమావేశం")

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో కొందరువ్యక్తులు ప్రస్తుతం పీడితప్రజల విముక్తి పోరాటాలపట్ల మాట్లాడని వైఖరి లేదా నిర్లక్ష్య వైఖరి, లేదా వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్నారు. వాస్తవంలో వారు గుత్తపెట్టుబడిదారీ ప్రయోజనాలను కాపాడుతూ, కార్మికవర్గ ప్రయోజనాలకు ద్రోహం చేస్తున్నారు. సోషల్ డెమాక్రాట్లుగా దిగజారి పోతున్నారు.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలోని ప్రజల విప్లవ పోరాటాల పట్ల తీసుకొన్న వైఖరే విప్లవాన్ని ఎవరు కోరుతున్నారో, ఎవరు కోరడం లేదో, నిజంగా ప్రపంచ శాంతిని ఎవరు బలపరుస్తున్నారో, దురాక్రమణ, యుద్ధ శక్తులను ఎవరు ప్రోత్సహిస్తున్నారో తెలుసుకోవడానికి ముఖ్య మైన గీటురాయిగా ఉంటుంది.

(8) ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలోని పీడిత దేశాలు, ప్రజలముందు, సామ్రాజ్యవాదాన్ని, దాని తాబేదార్లను ఎదిరించవలసిన అత్యవసర కర్తవ్యం ఉంది.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పాత, కొత్తవలస పెత్తందారీ విధానానికి వ్యతిరేకంగా, జాతీయ స్వాతంత్రంకోసం నూతన ప్రజా స్వామ్యం కోసం పోరాట పతాకాన్ని ఎత్తే పవిత్ర కర్తవ్యాన్ని, జాతీయ ప్రజాస్వామిక విప్లవోద్యమంలో అగ్రశ్రేణిలో నిలబడి సోషలిస్టు భవిష్యత్తు కోసం కృషిచేసే పవిత్ర కర్తవ్యాన్ని ఈ ప్రాంతాలలోని కార్మికవర్గ పార్టీ లకు చరిత్ర అప్పగించింది.

ఈ ప్రాంతాలలో, జనాభాలో చెప్పుకోదగినంత విస్తృతమైన వర్గాలు సామ్రాజ్యవాదం కింద బానిసలుగాపడి ఉండ నిరాకరిస్తున్నాయి. అలాంటి వారిలో కార్మికులు, రైతులు, మేధావులు, పెటీ బూర్జువాలే కాకుండా, దేశభక్తులైన జాతీయబూర్జువాలు, తుదకు దేశభక్తులైన కొందరు రాజులు, యువరాజులు, దొరలుకూడా ఉన్నారు.

కార్మికవర్గానికి, దాని పార్టీకి ప్రజానీకంయొక్క శక్తిపైన నమ్మకం ఉండాలి. అన్నిటికంటే ముఖ్యంగా రైతులతో ఐక్యమై, దృఢమైన కార్మిక-కర్షక ఐక్యతను స్థాపించాలి. కార్మికవర్గంలో అగ్రగాములైన సభ్యులు గ్రామీణ ప్రాంతాలలో పనిచేయడం, రైతులు సంఘటితమయ్యేట్లు తోడ్ప డటం, వారిలో వర్గచైతన్యాన్ని, జాతీయ ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వా సాన్ని పెంపొందించడం ప్రధాన కర్తవ్యంగా ఎంచుకోవాలి.

కార్మిక-కర్షక మైత్రిప్రాతిపదికపై కార్మికవర్గము, దానిపార్టీ సామ్రాజ్య వాదానికి, దాని తాబేదార్లకు వ్యతిరేకంగా ఐక్యంకాదగిన వారందరినీ ఐక్యపరచి, విశాలమైన ఐక్యసంఘటనను నిర్మించాలి. ఈ ఐక్యసంఘట

నను పటిష్ఠపంతం, విస్తృతం చేయాలంటే కార్మికవర్గపార్టీ సిద్ధాంతరీత్యా, నిర్మాణరీత్యా, తన స్వతంత్ర ప్రతిపత్తిని నిలబెట్టుకోవడం, విప్లవ నాయకత్వంపై వత్తిడితేవడం అవసరం.

కార్మికవర్గ పార్టీకి, విప్లవ ప్రజానీకానికి సాయుధ పోరాటంతో సహా అన్ని పోరాట పద్ధతులు కరతలామలకమై ఉండాలి. సామ్రాజ్యవాదము, దానితాబేదార్లూ సాయుధ దమననీతికి ఎప్పుడు దిగినాసరే, విప్లవసాయుధ శక్తితో విప్లవప్రతీఘాత సాయుధ శక్తిని ఓడించాలి.

ఇటీవలనే రాజకీయి స్వాతంత్ర్యంపొందిన దేశాలు తమ స్వాతంత్ర్యాన్ని పటిష్ఠం చేసుకోవడం, సామ్రాజ్యవాద శక్తులను, అంతరంగిక అభివృద్ధి నిరోధకశక్తులను రూపుమాపడం, వ్యాపసాయిక, తదితర సాంఘిక సంస్కరణలను అములుపరచడం, తమ జాతీయ ఆర్థిక వ్యవస్థను, సంస్కృతిని పెంపొందించుకోవడం వంటి క్లిష్టమైన కర్తవ్యాలను నేటికీ ఎదుర్కొంటున్నాయి. తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికై పాతవలస పెత్తందార్లు అనుసరించే నయావలస పెత్తందారీవిధానాలకు వ్యతిరేకంగా, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదంయొక్క నయావలస పెత్తందారీ విధానానికి వ్యతిరేకంగా ఈ దేశాలు పోరాడటం చాలా ప్రధానమైన విషయం.

ఈ దేశాలుకొన్నిటిలో, దేశభక్తికలిగిన జాతీయ బూర్జువావర్గం సామ్రాజ్యవాదానికి, వలస పెత్తందారీ విధానానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రజలపక్షాన ఉంటూ, సాంఘికాభ్యుదయానికి సంబంధించిన కొన్ని శాసనాలను ప్రవేశపెడుతున్నది, దేశభక్తియుతమైన జాతీయ బూర్జువావర్గంయొక్క అభ్యుదయపాత్రను కార్మికవర్గ పార్టీ పూర్తిగా బలపరచడం, వారితో ఐక్యతను పటిష్ఠం చేసుకోవడం అవసరం.

దేశంలోపల సామాజిక వైరుధ్యాలు, అంతర్జాతీయంగా వర్గపోరాటం తీవ్రం అయ్యేకొద్దీ, కొత్తగా స్వాతంత్ర్యంపొందిన కొన్ని దేశాలలో బూర్జువావర్గం, ముఖ్యంగా, బడా బూర్జువావర్గం సామ్రాజ్యవాదాన్ని అట్టిపెట్టేదిగా తయారవుతుంది. ప్రజావ్యతిరేక, కమ్యూనిస్టు వ్యతిరేక, విప్లవప్రతీఘాత విధానాలను అనుసరించడానికి సిద్ధమవుతుంది. ఈ అభి

వృద్ధి నిరోధక విధానాలను ఎదిరించడానికి కార్మికవర్గ పార్టీ నిర్విరామ కృషి సలపవలసి ఉంది.

మొత్తంమీద, ఈ దేశాలలో బూర్జువావర్గం ద్వంద్వస్వభావం కలిగి ఉంది. బూర్జువావర్గంతో కలిసి ఐక్యసంఘటనను నిర్మించినప్పుడు, కార్మికవర్గ పార్టీ విధానం-ఐక్యత-పోరాట విధానంగా ఉండాలి. బూర్జువావర్గం అభ్యుదయకర, సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పాత్ర నిర్వహించినంత వరకే ఐక్యసంఘటన విధానాన్ని అనుసరించాలి. వారు సామ్రాజ్యవాదంతోను, భూస్వామ్యవర్గంతోను రాజీపడి, మిలాఖతై లేదా లొంగిపోయే అభివృద్ధినిరోధక ధోరణులను అవలంబించినప్పుడు, వారికి వ్యతిరేకంగా పోరాడే విధానాన్ని అనుసరించాలి.

జాతీయ సమస్యపై కార్మికవర్గపార్టీ ప్రపంచ దృక్పథం అంతర్జాతీయతా సూత్రబద్ధమైనదేగాని జాతీయతత్వంతో కూడినదికాదు. విప్లవ పోరాటంలో అది అభ్యుదయకర జాతీయతత్వాన్ని బలపరుస్తుంది. అభివృద్ధినిరోధక జాతీయతత్వాన్ని వ్యతిరేకిస్తుంది. అది ఎల్లప్పుడూ తనకూ, బూర్జువా జాతీయతత్వానికి మధ్య స్పష్టమైన భేదాన్ని చూపెట్టాలి. అది బూర్జువా జాతీయతత్వానికి ఎప్పటికీ లొంగిపోకూడదు.

1960 స్టేట్‌మెంట్ ఇలా ఉంది. "బూర్జువా వర్గంలోని అభివృద్ధి నిరోధకులు తమ స్వార్థపూరిత, సంకుచిత వర్గ ప్రయోజనాలనే మొత్తం జాతి ప్రయోజనాలుగా ఎలా చిత్రిస్తుందో కమ్యూనిస్టులు వెల్లడి చేస్తారు; ఆ ప్రయోజనంకోసమే వాగాడంబరంగా బూర్జువా రాజకీయవేత్తలు సోషలిస్టు నినాదాలనుకూడా ఎలా ఉపయోగించుకొంటారో కమ్యూనిస్టులు వెల్లడిచేస్తారు...."

విప్లవంలో కార్మికవర్గం భూస్వాములు, బూర్జువాల తోకగా తయారైతే, జాతీయ ప్రజాస్వామిక విప్లవంలో నిజమైన, లేదా సంపూర్ణమైన విజయం సంభవించదు. ఒకవేళమైన విజయం సాధించినప్పటికీ, దానిని పటిష్టవంతం చేయటం అసంభవమవుతుంది.

ఏదిఏమైనా, పీడితప్రజల విప్లవపోరాటాల సమయంలో కార్మిక వర్గ పార్టీ సామ్రాజ్యవాదానికి, జాతీయ అభివృద్ధి నిరోధకులకు పూర్తి వ్యతి

రేకంగా, జాతీయ స్వాతంత్ర్యంకోసం, నూతన ప్రజాస్వామ్యంకోసం తన స్వంత కార్యక్రమాన్ని ముందు పెట్టాలి. అది ప్రజలమధ్య స్వతంత్రంగానే కృషిచేయాలి. అభ్యుదయకరశక్తులను నిరంతరం పెంపొందించాలి. మధ్యమ శక్తులను తనవైపు త్రిప్పుకోవాలి. అభివృద్ధినిరోధకశక్తులను వేరుపరచాలి; ఈ విధంగా చేస్తేనే అది జాతీయప్రజాస్వామిక విప్లవాన్ని చివరికంటా కొనసాగించి, విప్లవాన్ని సోషలిస్టు పంథాకు త్రిప్పగలదు.

(10) సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలలో పెట్టుబడిదారీ సమాజంయొక్క వైరుధ్యాలను పూర్తిగా పరిష్కరించడానికి కార్మికవర్గ విప్లవమూ, కార్మికవర్గ నియంతృత్వమూ అవసరమవుతాయి.

ఈ కర్తవ్య సాధనకు కృషి చేయడంలో, కార్మికవర్గ పార్టీ ప్రస్తుత పరిస్థితులలో, గుత్తపెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకించడానికి, ప్రజాస్వామిక హక్కులను కాపాడటానికి, ఫాసిజంప్రమాదాన్ని ఎదిరించడానికి, జీవనపరిస్థితులను మెరుగుపరచడానికి, సామ్రాజ్యవాదుల ఆయుధ విస్తరణను, యుద్ధ సన్నాహాలను వ్యతిరేకించడానికి, ప్రపంచశాంతిని పరిరక్షించడానికి, పీడితదేశాల విప్లవపోరాటాలను క్రియారూపంలో బలపరచడానికి కార్మికవర్గాన్ని, కార్మికప్రజలను చురుకుగా పోరాటాలలోకి తీసుకురావాలి.

అమెరికా సామ్రాజ్యవాదం తన చెప్పుచేతలకింద ఉంచుకొన్న, లేదా తన చెప్పుచేతలకింద ఉంచుకోజూస్తున్న పెట్టుబడిదారీ దేశాలలో, కార్మికవర్గము, ప్రజలు తమదాడులను ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదంపైన కేంద్రీకరించాలి. అలాగే జాతీయ ప్రయోజనాలకు ద్రోహం చేస్తున్నవారికి గుత్తపెట్టుబడిదార్లకు, తదితర అభివృద్ధినిరోధకశక్తులకు వ్యతిరేకంగాకూడా దాడులను కేంద్రీకరించాలి.

పెట్టుబడిదారీ దేశాలలో కార్మికవర్గము, శ్రామిక ప్రజలు ఒక నూతన జాగృతిని పొందినట్లు ఇటీవల సంవత్సరాలలో పెద్ద ఎత్తున జరిగిన ప్రజా పోరాటాలు రుజువుచేస్తున్నాయి. గుత్తపెట్టుబడిదారీ విధానాన్ని, అభివృద్ధి నిరోధకశక్తులను దెబ్బతీసే వారిపోరాటాలు తమ స్వదేశాలలో విప్లవ ఆశయానికి చక్కని అవకాశాలను ఏర్పాటుచేశాయి. అలాగే ఆసియా,

ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రజల విప్లవపోరాటాలకు, సోషలిస్టు శిబిరం లోని దేశాలకు బలమైన తోడ్పాటుగా ఉన్నాయి.

సామ్రాజ్యవాద, లేదా పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికవర్గ పార్టీలు విప్లవ పోరాటాలను నడపడంలో తమస్వంత సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోవాలి. ఇదే సందర్భంలో, అవి ఐక్యపరచదగిన శక్తులన్నిటినీ ఐక్యపరచి, గుత్తపెట్టుబడిదారీ విధానానికి, సామ్రాజ్య వాదుల దురాక్రమణ, యుద్ధవిధానాలకు వ్యతిరేకంగా విశాలమైన సంఘటనను నిర్మించాలి.

పెట్టుబడిదారీ దేశాలలోని కమ్యూనిస్టులు, తక్షణపోరాటాలను చురుకుగా నడుపుతూనే, వాటిని దీర్ఘకాల పోరాటంలోను, సార్వత్రిక ప్రయోజనాలతోను ముడిపెట్టాలి. ప్రజలకు మార్క్సిస్టు-లెనినిస్టు విప్లవపద్ధతిలో విద్యాబోధనచేయాలి. వారి రాజకీయచైతన్యాన్ని పెంపొందించడానికి నిర్విరామకృషి జరపాలి. కార్మికవర్గ విప్లవమనే చారిత్రక కర్తవ్యాన్ని చేపట్టాలి. వారు అలాచేయడంలో విఫలమైతే, తక్షణ ఉద్యమమే సమస్తమూ అనిభావిస్తే, ఆయా సమస్యనుబట్టి తమ వైఖరిని నిర్ణయించుకొంటూపోతే, రోజువారీ సంఘటనలకు మాత్రమే తమకృషిని పరిమితం చేసుకొంటూపోతే, శ్రామికవర్గ మౌలిక ప్రయోజనాలను వదిలివేస్తే అది సోషల్ డెమాక్రసీ అవుతుంది.

సోషల్ డెమాక్రసీ బూర్జువా సిద్ధాంతధోరణి. సోషల్ డెమాక్రటిక్ పార్టీలు బూర్జువావర్గానికి రాజకీయ దళాలని కార్మికవర్గ ఉద్యమంలో దాని ఏజెంట్లని, సాంఘికంగా దానిమూలస్తంభాలని లెనిన్ చాలాకాలం కిందటే చెప్పాడు. కమ్యూనిస్టులు కార్మికవర్గ విప్లవం, కార్మికవర్గ నియంతృత్వం అనే ప్రధానసమస్యపై తమకూ, సోషల్ డెమాక్రటిక్ పార్టీలకు ఉన్న భేదాన్ని ఎల్లప్పుడూ స్పష్టీకరించాలి. అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమం కోసు, శ్రామిక ప్రజలమధ్య సోషల్ డెమాక్రసీయొక్క సిద్ధాంతప్రభావాన్ని రూపుమాపాలి. నిస్సందేహంగానే, కమ్యూనిస్టులు సోషల్‌డెమాక్రాటిక్ పార్టీల పలుకుబడికిందగల ప్రజానీకాన్ని తమ వైపుతిప్పుకోవాలి. సోషల్ డెమాక్రాటిక్ పార్టీలలో ఉంటూ, దేశీయంగా గుత్త పెట్టుబడిదారీ

విధానాన్ని, విదేశసామ్రాజ్యవాద ప్రాబల్యాన్ని వ్యతిరేకించడానికి ముందుకువచ్చే వామపక్ష శక్తులను, మధ్యమ శక్తులను తమవైపు త్రిప్పు కోవాలి. కార్మికవర్గం జరిపే నిత్యపోరాటంలో, ప్రపంచశాంతి పరిరక్షణ కోసం జరిగే పోరాటంలో, విస్తృత సంయుక్త కార్యాచరణలో వారిని కలుపుకోవాలి.

కార్మిక వర్గాన్ని, శ్రామికప్రజలను విప్లవంలోకి తీసుకురావాలంటే, మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలకు అన్ని పోరాట పద్ధతులు కరతలామలకం అయిఉండాలి. పోరాటపరిస్థితులు మారినప్పుడల్లా, ఒక పద్ధతికిబదులుమరో పద్ధతినివెంటనే ప్రవేశపెట్టగలిగి ఉండాలి. కార్మికవర్గంయొక్క అగ్రగామికి శాంతియుతమైనవి సాయుధమైనవి, బహిరంగమైనవి రహస్యమైనవి, చట్ట బద్ధమైనవి చట్ట వ్యతిరేకమైనవి, పార్లమెంటరీ పోరాటం, ప్రజాపోరాటం మొదలైన అన్ని పోరాట పద్ధతులు కరతలామలకం అయి ఉంటేనే, అది అన్ని పరిస్థితులలోను అజేయంగా నిలబడగలదు. ఉపయోగించుకోవడానికి వీలు ఉన్నప్పుడు, ఉపయోగించుకోవలసిన అవసరం వచ్చినప్పుడు పార్ల మెంటరీ తదితర చట్టబద్ధమైన పోరాటపద్ధతులను ఉపయోగించుకో నిరాకరించడం తప్పు. అయినప్పటికీ, ఒక మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ చట్టబద్ధమైన కార్యకలాపాలపైన, పార్లమెంటులో లభించే అవకాశాలపైన నమ్మకంపెట్టుకు కూర్చుని, బూర్జువావర్గం అనుమతించే హద్దులలోపల పోరాటాన్ని పరిమితం చేస్తే, ఇది కార్మికవర్గ విప్లవానికి, కార్మికవర్గ నియం తృత్వానికి తప్పనిసరిగా తిలోదకాలు సమర్పించడానికే దారితీస్తుంది.

(11) పెట్టుబడిదారీ విధానంనుండి సోషలిజానికి పరివర్తన చెందే సమస్యపై కార్మికవర్గ పార్టీ వర్గపోరాట, విప్లవపైఖరితో ప్రారంభించాలి. కార్మికవర్గ విప్లవానికి కార్మికవర్గ నియంతృత్వానికి సంబంధించిన మార్క్సిస్టు-లెనినిస్టు బోధనలపై ఆధారపడాలి.

శాంతియుత పద్ధతులద్వారా సోషలిజానికి పరివర్తన చెందడం ఉత్తమమని కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ భావిస్తారు. అయితే శాంత యుత పరివర్తనను అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక నూతన ప్రపంచ వ్యూహాత్మక సూత్రంగా చేయడం సరియైనదేనా? కానేకాదు.

అన్ని విప్లవాలలోను రాజ్యాధికారం ప్రధానమైన సమస్య అని మార్క్సిజం-లెనినిజం సర్వదా బోధిస్తూ ఉంది. 1957 డిక్లరేషన్, 1960 స్టేట్‌మెంట్ రెండూ "పాలకవర్గాలు తమంతట తామే అధికారాన్ని ఎప్పటికీ వదలుకోరు అని లెనినిజం బోధిస్తున్నది. అనుభవం చాటి చెబుతున్నది" అని స్పష్టంగా పేర్కొన్నాయి. పాత ప్రభుత్వాన్ని దించివేస్తే తప్ప సంక్షోభకాలంలో సైతం అది ఎప్పటికీ దిగిపోదు. ఇది వర్గపోరాటం యొక్క విశ్వజనీన సూత్రం.

నిర్దిష్టచారిత్రక పరిస్థితులలో, విప్లవం శాంతియుతంగా పరిణమించే అవకాశం ఉంటుందని మార్క్సు, లెనిన్‌లు చెప్పారు. అయితే, లెనిన్ పేర్కొన్నట్లు, శాంతియుత విప్లవపరిణామం ఒక అవకాశం, "విప్లవాల చరిత్రలో ఇది చాలా అరుదుగానే కనిపిస్తుంది."

వాస్తవంలో, పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజానికి శాంతియుతంగా పరివర్తన చెందినట్లు ఒక్క చారిత్రక ఉదాహరణకూడా లేదు.

పెట్టుబడిదారీ విధానం స్థానాన్ని సోషలిజం తప్పనిసరిగా ఆక్రమిస్తుందని మార్క్సు జోస్యం చెప్పినప్పుడు అలాంటి ఉదాహరణ ఏది లేదుగదా, అలాంటప్పుడు ఉదాహరణ ఏదీ లేకపోయినా పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజానికి శాంతియుతంగా పరివర్తన చెందవచ్చునని మనం జోస్యం ఎందుకు చెప్పకూడదు? అని కొందరు వ్యక్తులు వాదిస్తారు.

ఈ పోలిక హాస్యాస్పదమైనది. గతితార్కిక, చారిత్రక భౌతికవాదాన్ని ఉపయోగిస్తూ, మార్క్సు పెట్టుబడిదారీ విధానంయొక్క వైరుధ్యాలను పరిశీలించాడు. మానవసమాజ పరిణామంయొక్క భౌతికనియమాలను కనుగొన్నాడు. ఒక శాస్త్రీయమైన నిర్ణయానికి వచ్చాడు. కాగా, "శాంతియుత పరివర్తన" పై చాలా ఆశలన్నీ పెట్టుకొన్న ప్రవక్తలు చారిత్రక భావవాదం నుండి బయలుదేరుతారు. పెట్టుబడిదారీ విధానంయొక్క అతి ప్రధాన వైరుధ్యాలను ఖాతరు చేయరు. వర్గపోరాటాన్ని గూర్చి మార్క్సిస్టు-లెనినిస్టు బోధనలను త్రోసిపుచ్చుతారు. స్వీయ మానసికమైన, నిరాధారమైన నిర్ణయాలకు వస్తారు. మార్క్సిజాన్ని త్రోసిపుచ్చే వారు మార్క్సునుండి ఎలాంటి తోడ్పాటు పొందగలరు?

పెట్టుబడిదారీ దేశాలు తమ ప్రభుత్వ యంత్రాగాన్ని, తమ మిలటరీ యంత్రాంగాన్ని పటిష్ఠం చేసుకుంటున్నాయనే విషయం ప్రతి ఒక్కరికీ తెలుసు. తమ దేశాలలోని ప్రజలను అణచివేయడమే ఆ యంత్రాంగం యొక్క ప్రధానోద్దేశం.

సామ్రాజ్యవాదులు, అభివృద్ధి నిరోధకులు శాంతియుత పరివర్తనను అంగీకరిస్తారనే భ్రమతో కార్మికవర్గ పార్టీ విప్లవంకోసం తన ఆలోచనలను, సాధనాలను, తన మొత్తం కృషిని ఎప్పటికీ అధారం చేసుకోకూడదు. కార్మికవర్గపార్టీ రెండు పరిస్థితులకు సిద్ధంకావాలి: శాంతియుత విప్లవ పరిణామం కోసం తయారవుతూనే శాంతేతర పరిణామం కోసం కూడా పూర్తిగా అది తయారుకావాలి, విప్లవబలాన్ని కూడదీయడమనే కష్టమైన కృషిపై అది కేంద్రీకరించాలి. అలాచేస్తే విప్లవం కోసం పరిస్థితులు పరిపక్వమైనప్పుడు విజయ సాధనకుగాని, సామ్రాజ్యవాదులు అభివృద్ధి నిరోధకులు ఆకస్మికదాడులు, సాయుధదుండగాలు జరిపితే బలమైన దెబ్బకొట్టడానికి సిద్ధంగా ఉండగలరు.

కార్మికవర్గ పార్టీ ఇలాంటి సన్నాహాలు చేయడంలో విఫలమైతే, కార్మికవర్గంయొక్క విప్లవకోరికను మంటగలిపినట్లు అవుతుంది. సిద్ధాంత రీత్యా నిరాయుధమై రాజకీయంగా నిర్మాణరీత్యా రెండు విధాల పూర్తి అసంసిద్ధమై నిస్పృహలో మునిగిపోతుంది. ఇక కార్మికవర్గ విప్లవాశయాన్ని పాతిపెట్టడమే దాని పర్యవసానం.

(12) మానవచరిత్రయొక్క వేర్వేరు దశలలో సామాజిక విప్లవాలన్నీ చారిత్రకంగా అనివార్యమైనవి. మానవుని ఇష్టంతో నిమిత్తం లేకుండా భౌతికనియమాలచే ఇవి పాలింపబడతాయి. పైపెచ్చు, ఒడుదుడుకులు త్యాగాలు లేకుండా విజయం పొందగలిగిన విప్లవంలేదనేది చరిత్ర రుజువుచేస్తున్నది.

మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని ప్రాతిపదిక చేసుకోవడంతో, నిర్దిష్టమైన చారిత్రక పరిస్థితులను పరిశీలించడం; సరైన వ్యూహాన్ని ఎత్తుగడలను ప్రవేశపెట్టడం; అగోచరమైన అడ్డంకులను అధిగమించడం.

అనవసరమైన త్యాగాలను మానుకోవడం, క్రమంగా తమ గమ్యాన్ని చేరుకోవడంలో ప్రజానీకానికి తోడ్పడడం కార్మికవర్గపార్టీ కర్తవ్యమైంది. త్యాగాలను మొత్తంగా మానుకోవడం సాధ్యమేనా? బానిస విప్లవాలు, అర్ధబానిస విప్లవాలు. బూర్జువా విప్లవాలు లేదా జాతీయ విప్లవాల విషయంలో ఇలా జరగదు; కార్మికవర్గ విప్లవాల విషయంలోకూడా ఇలా జరగదు. విప్లవానికి తోడ్పడే పంథా సరైందే అయినప్పటికీ, విప్లవ అపజయాలు, త్యాగాలు అవసరం కాబోవనే హామీ ఇవ్వడం అసాధ్యం. సరైన పంథాను అనుసరించినంతవరకు, విప్లవమే ఆఖరున విజయం పొందితీరుతుంది. త్యాగాలను మానుకోవడం అనే సాకుతో విప్లవాన్ని వదలిపెట్టడం అంటే, మీరు శాశ్వతంగా బానిసలుగానేపడి ఉండండి, అంతులేని బాధను, త్యాగాన్ని సహించండి అని వాస్తవంలో ప్రజలను కోరడమన్నమాటే.

విప్లవపు పురిటినొప్పులు పాత సమాజపు నిరంతర బాధకంటే ఎంతో తక్కువ బాధాకరంగా ఉంటాయని మార్క్సిజం-లెనినిజం యొక్క ప్రాథమిక విజ్ఞానం బోధిస్తుంది. "ఎంతో శాంతియుతమైన సంఘటనలతో సహా, నేటి (పెట్టుబడిదారీ) వ్యవస్థ కార్మికవర్గంచేత ఎల్లప్పుడూ, అనివార్యంగా లెక్కలేనన్ని త్యాగాలను చేయిస్తుంది" అని లెనిన్ చక్కగా చెప్పాడు. (మరో మూక ఉమ్మడి హత్య" పుట 11 సంపుటి 5 "ది కంప్లీట్ వర్క్స్ ఆఫ్ లెనిన్")

అంతా సవ్యంగా సాగిపోయేట్లయితేనే, త్యాగాలు, అపజయం లేకుండా ముందుకు వెళ్ళుతామనే హామీ ఉంటేనే, విప్లవాన్ని నడిపించాలని భావించేవాడు నిజంగా విప్లవకారుడు కానేకాదు.

పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నా, విప్లవం ఎంతటి త్యాగాలను, అపజయాలను ఎదుర్కోవలసి వచ్చినా, కార్మికవర్గ విప్లవకారులు ప్రజానీకాన్ని విప్లవ పద్ధతిలో చైతన్యవంతులుగా చేయాలి, విప్లవ పతాకను ఉన్నత స్థాయిలో ఉంచాలేగాని వదలిపెట్టకూడదు.

కార్మికవర్గ పార్టీ భౌతికపరిస్థితులు పరిపక్వం కాకముందే దుందుడుకుగా విప్లవాన్ని లేవదీస్తే, అది "అతివాద" దుస్సాహస విధానమే

అవుతుంది. అయితే కార్మికవర్గ పార్టీ భౌతికపరిస్థితులు పరిపక్వమై ఉన్నప్పుడు విప్లవాన్ని నడపడానికి, ప్రభుత్వాధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి, సాహసించకపోతే అది మితవాద అవకాశవాదమే అవుతుంది.

మామూలు పరిస్థితులలో కూడా, ప్రజానీకాన్ని నిత్యపోరాటాలలోకి తీసుకువస్తున్నప్పుడు, కార్మికవర్గ పార్టీ సిద్ధాంతరీత్యా, రాజకీయంగా, [illegible]రీత్యా రన కార్యకర్తలను, ప్రజానీకాన్ని విప్లవానికి సిద్ధపరచాలి. విప్లవ పోరాటాలను ప్రోత్సహించాలి. అలా చేస్తే విప్లవానికి పరిస్థితులు పరిపక్వమైనప్పుడు అభివృద్ధి నిరోధక పరిపాలనను కూలదోసి నూతన ప్రభుత్వాధికారాన్ని స్థాపించడానికిగల అవకాశాన్ని అది జారవిడవకుండా ఉండగలదు. లేకపోతే, భౌతిక పరిస్థితులు పరిపక్వమై ఉన్నప్పుడు, కార్మికవర్గ పార్టీ విజయాన్ని చేబట్టే అవకాశాన్ని ఊరకనే జారవిడుస్తుంది.

కార్మికవర్గ పార్టీ ఎంతో సూత్రబద్ధంగా ఉంటూనే, ఇచ్చి పుచ్చుకోవడానికి అందుబాటులో కూడా ఉండాలి. సమయం వచ్చినప్పుడు విప్లవ ప్రయోజనాల దృష్ట్యా, అవసరమైన రాజీ ఒప్పందాలు కుదుర్చుకోవాలి. అయితే ఇచ్చి పుచ్చుకొనే సాకుతో, అవసరమైన రాజీ ఒప్పందాల సాకుతో, సూత్రబద్ధమైన విధానాలను, విప్లవ గమ్యాన్ని ఎప్పటికీ వదలకూడదు.

శత్రువులకు వ్యతిరేకంగా పోరాటాలు జరపడానికి కార్మికవర్గ పార్టీ ప్రజానీకానికి నాయకత్వం వహించాలి. ఆ శత్రువుల మధ్యగల వైరుధ్యాలను ఎలా ఎలా ఉపయోగించుకోవాలో అది గ్రహించాలి. అయితే ఈ వైరుధ్యాలను ఉపయోగించుకోవడంలో ఉద్దేశం ప్రజావిప్లవ పోరాటాల గమ్యం చేరుకోవడాన్ని సులభతరం చేయడానికేగాని ఈ పోరాటాలను రద్దు చేయడానికి కాదు.

సామ్రాజ్యవాదంయొక్క, అభివృద్ధి నిరోధకత్వంయొక్క చీకటి పరిపాలన ఉన్నచోటెల్లా, జనాభాలో నూటికి తొంభై మందికిపైగా ప్రజలు ఇప్పుడో, మరొకప్పుడో విప్లవం లేవదీస్తున్నట్లు లెక్కలేనన్ని వాస్తవాలు రుజువుచేశాయి.

కమ్యూనిస్టులు ప్రజానీకంయొక్క విప్లవ కోర్కెలనుండి వేరుపడి

పోతే, వారు ప్రజానీకంయొక్క విశ్వాసాన్ని తప్పనిసరిగా కోల్పోతారు. విప్లవ ప్రవాహానికి వెనకబడిపోతారు.

ఏ పార్టీలోనైనా నాయకత్వం వహించే గ్రూపు మార్క్సిస్టేతర పంథాను అనుసరించి, దానిని మితవాద పార్టీగా మార్చివేస్తే, ఆ పార్టీ లోపల, బయట ఉన్న విప్లవకారులైన లెనినిస్టులు వారి స్థానాని [illegible] మించి, ప్రజలను విప్లవంలోకి తీసుకువస్తారు. మరొకదశలో, విప్లవకారులు విప్లవాన్ని నడపడానికై ముందుకురావడం, కార్మికవర్గ పార్టీ తన విప్లవ నాయకత్వాన్ని కోల్పోవడం జరుగుతుంది. అభివృద్ధి నిరోధకమైన బూర్జువావర్గం విప్లవానికి ద్రోహంచేసి, ప్రజలను అణచివేసినప్పుడు, అవకాశవాద పంథా కమ్యూనిస్టులకు, విప్లవ ప్రజానీకానికి విషాదకరమైన అనవసరమైన నష్టాలు కలిగిస్తుంది.

కమ్యూనిస్టులు అవకాశవాద పంథాకు దిగజారితే, వారు బూర్జువా జాతీయవాదులుగా తయారవుతారు. సామ్రాజ్యవాదులకు, అభివృద్ధి నిరోధక బూర్జువాలకు తోకలు అయిపోతారు.

లెనిన్ తర్వాత తాము విప్లవ సిద్ధాంతానికి బ్రహ్మాండమైన సృజనాత్మకమైన తోడ్పాటు ఇచ్చామని, తాము ఒక్కరే సరైన వారమని చెప్పుకొనే వ్యక్తులు కొందరు ఉన్నారు. అయితే వారు యావత్తు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క విస్తృత అనుభవాలను నిజంగా ఎప్పుడైనా పరిశీలించారా లేదా అనేది, వారు మొత్తం అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమంయొక్క ప్రయోజనాలను, గమ్యాన్ని, కర్తవ్యాలను నిజంగా ఎప్పుడైనా పరిశీలించారా లేదా అనేది, మార్క్సిజం-లెనినిజానికి అనుగుణంగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక సాధారణ పంథా వారి దృష్టిలో ఉందా లేదా అనేది చాలా సందేహాస్పదం.

గత కొద్ది సంవత్సరాలలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమమూ, జాతీయవిముక్తి ఉద్యమమూ అనేక అనుభవాలను, అనేక గుణపాఠాలను పొందాయి. ప్రజలు ప్రశంసించవలసిన అనుభవాలు, ప్రజలకు దుఃఖము కలిగించే అనుభవాలు ఉన్నాయి. అన్ని దేశాలలోని కమ్యూనిస్టులూ, విప్లవకారులూ ఈ విజయానుభవాలను, అపజయానుభవాలను పరిశీలిం

చాలి, వీటిని తీవ్రంగా అధ్యయనం చేయాలి. వీటినుండి సరైన నిర్ణయాలు తీసుకోవాలి; ఉపయోగకరమైన గుణపాఠాలను నేర్చుకోవాలి.

(13) సోషలిస్టు దేశాలూ, పీడితజాతుల, పీడితదేశాల విప్లవపోరాటాలూ ఒకదానినొకటి బలపరచుకొంటాయి. ఒకదానికొకటి తోడ్పడతాయి. ...స్యా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల జాతీయవిముక్తి ఉద్య...ట్టుబడిదారీ దేశాల విప్లవోద్యమాలు సోషలిస్టు దేశాలకు బలమైన తోడ్పాటుగా ఉన్నాయి. దీనిని త్రోసిపుచ్చడం శుద్ధతప్పు.

పీడితజాతుల, పీడితదేశాల, విప్లవ పోరాటాలపట్ల సోషలిస్టు దేశాలు అవలంబించవలసిన ఏకైక వైఖరి ఏమిటంటే అవి హృదయపూర్వకమైన సానుభూతిని, చురుకైన సహకారాన్ని అందజేయాలి; నిర్లక్ష్యవైఖరిని గాని, జాతీయ స్వార్థంతోకూడిన, లేదా పెద్దరాజ్యమనే జాతీయ దురహంకార వైఖరినిగాని అవలంబించకూడదు.

లెనిన్ ఇలా చెప్పాడు: "సామ్రాజ్యవాదులలో ఏ ఒక్కరికి వ్యతిరేకంగానైనా సరే, సామ్రాజ్యవాదులందరికి వ్యతిరేకంగానైనా సరే, అభివృద్ధిపొందిన దేశాలలోని విప్లవకారులతో, పీడిత ప్రజలందరితో స్నేహం కలిగివుండటం శ్రామికవర్గ విదేశాంగ విధానంగా ఉంటుంది." ("రష్యన్ విప్లవ విదేశాంగవిధానం" పుట 72 సంపుటి 5 "లెనిన్ సంపూర్ణ రచనలు") ఈ విషయాన్ని ఎవరైనా అవగాహన చేసుకోకపోతే, పీడితప్రజలకు పీడిత దేశాలకు సోషలిస్టు దేశాలు అందజేసేతోడ్పాటు, సహాయం, ఒక భారమనిగాని, దానమనిగాని భావిస్తే, మార్క్సిజం-లెనినిజానికి, కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రానికి వ్యతిరేకంగా వెళ్ళినట్లే అవుతుంది.

నిర్మాణంలో సోషలిస్టు వ్యవస్థయొక్క విశిష్టత, సోషలిస్టు దేశాల విజయాలు ఆదర్శమైన పాత్ర వహిస్తున్నాయి. పీడితజాతులకు, పీడిత దేశాలకు ప్రోత్సాహకరంగా ఉన్నాయి.

అయితే ఈ ఉత్తేజం, ప్రోత్సాహము పీడితప్రజల, పీడితదేశాల విప్లవ పోరాటాలకు ప్రత్యామ్నాయం మాత్రం కాజాలదు. ఏ పీడితప్రజలు గాని, పీడితదేశంగాని ఆత్మవిశ్వాసంతో జరిపిన తనస్వంత విప్లవపోరాటం ద్వారానే తప్ప ఇతరత్రా విముక్తి సాధించుకోజాలదు.

సోషలిస్టు దేశాలకు, సామ్రాజ్యవాద దేశాలకు మధ్య శాంతియుత పోటీవహించే పాత్రను కొందరు వ్యక్తులు ఏకపక్షంగా గోరంతలు కొండంతలు చేసిచెప్పారు. పీడితప్రజల పీడితదేశాల విప్లవ పోరాటాల స్థానంలో శాంతియుత పోటీని నిలబెట్టేందుకు ప్రయత్నించారు. వారి ప్రచారాన్నిబట్టి శాంతియుత పోటీకాలంలో సామ్రాజ్యవాదం తనంతట తానే నాశనమైపోతుందని, ఇలాంటి రోజుకోసం ప్రశాంతంగా ఎదురుచూడటం మాత్ర పీడితప్రజలు, పీడితదేశాలు చేయవలసిన పని అన్నట్లు మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథాలకు, దీనికి ఏమైనా పొత్తుకుదురు...

పైపెచ్చు, చైనా, తదితర కొన్ని సోషలిస్టు దేశాలు "యుద్ధాలను లేవదీయాలని," "రాజ్యాలమధ్య యుద్ధాల" ద్వారా సోషలిజాన్ని వ్యాపింపజేయాలని ఉద్దేశిస్తున్నట్లు కొందరు వ్యక్తులు వింతకథను సృష్టించారు. ఇలాంటి కథలు సామ్రాజ్యవాదులు అభివృద్ధి నిరోధకులు వేసే నిందలు తప్ప మరొకటికావని 1960 స్టేట్‌మెంట్ పేర్కొన్నది. నిర్మొగమాటంగా చెప్పాలంటే ఈ నిందలను వల్లించే వారి ఉద్దేశం ప్రపంచ పీడితప్రజల, పీడిత దేశాల విప్లవాలకు, అలాంటి విప్లవాలను బలపరిచేవారికి తాము వ్యతిరేకులనే వాస్తవాన్ని కప్పిపుచ్చుకోవడమేకాక, ఇతరులు సమర్థించటం సైతం వారికి ఇష్టంలేదనే చెప్పాలి.

(14) గత కొలది సంవత్సరాలలో, యుద్ధమూ, శాంతి సమస్యపై ఎంతో రభస, వాస్తవంలో పెద్దరభసే జరిగింది. ఈ సమస్యపై మా దృక్పథాలు, విధానాలు ప్రపంచానికి తెలుసు. వాటిని ఎవ్వరూ వక్రంగా చిత్రించబూనుకోవటం నిరుపయోగం.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో కొందరు వ్యక్తులు తాము శాంతిని ఎంతగా ప్రేమిస్తున్నారో, యుద్ధాన్ని ఎంతగా ద్వేషిస్తున్నారో చెప్పుకొంటున్నప్పటికీ, యుద్ధాన్ని గూర్చి లెనిన్ పేర్కొన్న సాధారణ వాస్తవాన్ని కొద్దిగానైనా అవగాహన చేసుకోవటానికి ఇష్టపడకపోవడం విచారకరం.

లెనిన్ ఇలా చెప్పాడు: "యుద్ధ సమస్యనుగూర్చి మామూలుగా విస్మరించబడుతున్న, తగినంత శ్రద్ధ కనబరచబడకపోతున్న ప్రధాన విష

యం, ఇది ఎంతో వివాదాస్పదంగా, ఇంకా చెప్పాలంటే, నిష్ప్రయోజనమైన, నిరర్థకమైన, ఉద్దేశరహితమైన వివాదంగా తయారు కావడానికి ప్రధానకారణం ఏమిటంటే, యుద్ధంయొక్క వర్గస్వభావానికి సంబంధించిన ప్రధాన సమస్యను, అంటే యుద్ధం ఎందుకువచ్చింది? దానిలో పాల్గొంటున్న వర్గాలేవి? అందుకు దారితీసిన చారిత్రక, ఆర్థిక పరిస్థితులేవి? అనే సమస్య వారు విస్మరిస్తున్నట్లు కనిపిస్తుంది." ("యుద్ధమూ, విప్లవమూ" సంపుటి 24 "లెనిన్ సంపూర్ణ రచనలు")

మార్క్సిస్టు-లెనినిస్టుల దృక్పథం ప్రకారం, ఇతర పద్ధతులద్వారా రాజకీయాలను కొనసాగించడమే యుద్ధం. ప్రతి యుద్ధమూ రాజకీయ వ్యవస్థనుండి, అందుకు దారితీసే రాజకీయ పోరాటాలనుండి విడదీయ రానిది. వర్గపోరాటచరిత్ర యావత్తూ ధ్రువపరచిన ఈశాస్త్రీయ మార్క్సిస్టు-లెనినిస్టు సూత్రాన్ని వదిలిపెట్టినట్లయితే, యుద్ధ సమస్యనుగాని, శాంతి సమస్యనుగాని ఎవ్వరూ ఎప్పటికీ అవగాహన చేసుకోలేరు.

వేర్వేరు విధాలుగాశాంతి, వేర్వేరువిధాలుగా యుద్ధమూ ఉంటాయి. ఏ విధమైనశాంతి, లేదా యుద్ధం చర్చనీయాంశంగా ఉందో మార్క్సిస్టు-లెనినిస్టులకు స్పష్టమైన అవగాహన ఉండాలి. న్యాయమైన యుద్ధాలను, అన్యాయమైన యుద్ధాలను ఒకే గాటికికట్టి, విచక్షణ లేకుండా వాటినన్నిటిని వ్యతిరేకించడమనేది బూర్జువా శాంతివాద దృక్పథమేగాని మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథం కాదు.

యుద్ధాలు లేకుండా విప్లవాలు పూర్తిగా సాధ్యమేనని కొందరు వ్యక్తులు వాదిస్తున్నారు. ప్రస్తుతం వారు ఏ విధమైన యుద్ధాన్ని ప్రస్తావిస్తున్నారు? జాతీయవిముక్తి యుద్ధామా, లేక విప్లవ అంతర్యుద్ధమా? లేక ప్రపంచయుద్ధమా?

వారు జాతీయవిముక్తి యుద్ధాన్నిగాని, విప్లవ అంతర్యుద్ధాన్నిగాని ప్రస్తావిస్తున్నట్లయితే ఈ సూత్రీకరణ ఆచరణలో విప్లవయుద్ధాలకు, విప్లవానికి వ్యతిరేకమైనది.

వారు ప్రపంచయుద్ధాన్ని ప్రస్తావిస్తున్నట్లయితే, లేని లక్ష్యంవైపు గురిపెట్టి కాల్చుతున్నారన్నమాట. రెండు ప్రపంచయుద్ధాల చరిత్ర ఆధా

రంగా, ప్రపంచయుద్ధాలు అనివార్యంగా విప్లవానికి దారితీస్తాయని మార్క్సిస్టు-లెనినిస్టులు పేర్కొన్నప్పటికీ, ప్రపంచ యుద్ధం ద్వారానే విప్లవాన్ని లేవదీయాలని ఏ మార్క్సిస్టు-లెనినిస్టూ ఎన్నడూ వాదించలేదు, ఎన్నటికీ వాదించబోడు.

యుద్ధాన్ని రద్దుచేయడం మార్క్సిస్టు లెనినిస్టులు తమ ఆదర్శంగా భావిస్తారు, యుద్ధాన్ని రద్దుచేయవచ్చునని నమ్ముతారు.

అయితే యుద్ధాన్ని ఎలా రద్దుచేయవచ్చు? దీనిపై లెనిన్ ఇచ్చిన అభిప్రాయం ఇది. "....సోషలిస్టు సామాజిక వ్యవస్థను సాధించడం మన ఆశయం. వర్గాలుగా మానవజాతి విభజనను రద్దుపరచడం ద్వారా, మానవుని మానవుడు జాతిని పరోజాతి దోచుకోవడం పూర్తిగా రద్దుచేయడంద్వారా అది యుద్ధంవచ్చే అవకాశమే లేకుండా చేయుగలదు." ("యుద్ధమూ, విప్లవమూ," పుటలు 367-368, సంపుటి 24, "లెనిన్ సంపూర్ణ రచనలు")

1960 ప్రకటనలో కూడా "ప్రపంచమంతటా సోషలిస్టువిజయం అన్ని యుద్ధాలకుగల సామాజిక, జాతీయ కారణాలను పూర్తిగా తొలగించ గలద"ని చాలా స్పష్టంగా పేర్కొనబడింది.

అయినప్పటికీ, సామ్రాజ్యవాద వ్యవస్థ ఉండగా మానవునిచే మానవుని దోపిడీ నేటికీ కొనసాగుతూ ఉండగా, "సమగ్ర, సంపూర్ణ నిరాయుధీకరణ" ద్వారా "ఆయుధాలులేని, సాయుధ బలగాలులేని, యుద్ధాలులేని" ప్రపంచాన్ని సృష్టించడం సాధ్యమేనని కొందరు వ్యక్తులు నేడు వాస్తవంగానే వాదిస్తున్నారు. ఇది వట్టి భ్రమ.

సాయుధ బలగాలు ప్రభుత్వ యంత్రాంగంలో ప్రధానమైన భాగమని, ఆయుధాలులేని, సాయుధబలగాలులేని ప్రపంచం ప్రభుత్వాలులేని ప్రపంచం మాత్రమే కాగలదని మార్క్సిజం-లెనినిజంయొక్క ప్రాథమిక జ్ఞానంవల్ల మనకు బోధపడుతుంది. లెనిన్ ఇలా అన్నాడు: "శ్రామికవర్గం బూర్జువా వర్గాన్ని నిరాయుధం చేసిన తర్వాతనే, తన ప్రపంచ చరిత్రాత్మక ఆశయాన్ని మంటగలపకుండా, అన్ని ఆయుధాలను చెత్తకుప్పలో పోయగలదు; శ్రామికవర్గం నిస్సందేహంగానే ఈ పని చేయగలదు.

అయితే ఈ పరిస్థితి ఏర్పడినప్పుడు మాత్రమే, నిజంగా అంతకుముందే కాదు." ("శ్రామికవర్గ విప్లవంయొక్క యుద్ధ కార్యక్రమం" పుట 77, సంపుటి 23 "లెనిన్ సంపూర్ణ రచనలు")

నేడు ప్రపంచంలోని వాస్తవాలేమిటి? అమెరికా నాయకత్వాన సామ్రాజ్యవాద దేశాలు సమగ్ర, సంపూర్ణ నిరాయుధీకరణను అమలు జరపడానికి సిద్ధంగా ఉన్నట్లు రవ్వంతైనా రుజువు ఉందా? ఒక్కటి అనకుండా న్ని సమగ్రసంపూర్ణ అయుధ విస్తరణలో నిమగ్నమైయుండలేదా?

సామ్రాజ్యవాదుల ఆయుధ విస్తరణను, యుద్ధ సన్నాహాలను బట్టబయలు చేయాలన్నా, రూపుమాపాలన్నా సమగ్ర నిరాయుధీకరణకై ప్రతిపాదన చేయడం అవసరమని మేము ఎల్లప్పుడూ వాదిస్తూనే ఉన్నాము. అంతేకాదు. సోషలిస్టు దేశాల, యావత్తు ప్రపంచ ప్రజల సమిష్టి పోరాటం ద్వారా, నిరాయుధీకరణ సమస్యపై ఏదో ఒక ఒప్పందానికి వచ్చేట్లు సామ్రాజ్యవాదాన్ని వత్తిడిపెట్టడం సాధ్యమవుతుంది. ఎవరైనా సమగ్ర, సంపూర్ణ నిరాయుధీకరణను ప్రపంచ శాంతికి ప్రధానమార్గంగా లెక్కిస్తే, సామ్రాజ్యవాదం తనంతట తానే ఆయుధాలు కిందపెడుతుందనే భ్రమను వ్యాపింపజేస్తే, నిరాయుధీకరణ సాకుతో పీడితప్రజల, పీడితజాతుల విప్లవ పోరాటాలను తుడిచివేయడానికి ప్రయత్నిస్తే, ఇది బుద్ధిపూర్వకంగానే ప్రపంచ ప్రజలను మోసగించినట్లు అవుతుంది; దురాక్రమణ, యుద్ధ విధానాలలో సామ్రాజ్యవాదులకు తోడ్పడినట్లే అవుతుంది.

యుద్ధము, శాంతి సమస్యపై అంతర్జాతీయ, కార్మికవర్గ ఉద్యమంలో నేడున్న సిద్ధాంత గందరగోళాన్ని అధిగమించాలంటే, ఆధునిక రివిజనిస్టులు విసర్జించిన లెనిన్ సిద్ధాంతాన్ని పునరుద్ధరించాలని మా అభిప్రాయం. సామ్రాజ్యవాదుల దురాక్రమణ, యుద్ధ విధానాలను రూపుమాపడానికి, ప్రపంచశాంతి పరిరక్షణకు ఇది అవసరం.

ప్రపంచప్రజలు ఏకకంఠంతో నూతన ప్రపంచయుద్ధాన్ని నిరోధింప గోరుతున్నారు. నూతన ప్రపంచ యుద్ధాన్ని నిరోధించడం సాధ్యమే.

అలాంటప్పుడు, ప్రపంచ శాంతిసాధనకు మార్గమేమిటి? అనేదే సమస్య. లెనినిస్టు దృక్పథం ప్రకారం, అన్ని దేశాలలోని ప్రజలపోరాటాల

ద్వారా మాత్రమే ప్రపంచ శాంతిని సాధించవచ్చు. అంతేకాని సామ్రాజ్య వాదులను బ్రతిమాలుకోవడం ద్వారా కాదు. సోషలిస్టు శిబిరంయొక్క బలాన్ని అభివృద్ధిపరచడం, అన్ని దేశాల కార్మికవర్గంయొక్క, శ్రామిక ప్రజానీకంయొక్క విప్లవపోరాటాలు, పీడితజాతుల విముక్తి పోరాటాలు, శాంతికాముకులైన ప్రజలందరి, శాంతికాముక దేశాలన్నిటి పోరాటాలపై ఆధారపడటంద్వారా మాత్రమే ప్రపంచశాంతిని గట్టిగా కాపాడవచ్చు.

ఇది లెనినిస్టు విధానం. దీనికి వ్యతిరేక విధానం ఏదైనా ఖచ్చితంగా ప్రపంచశాంతికి దారితీయదు. పైపెచ్చు, సామ్రాజ్యవాదుల పేరాశలను మాత్రమే ప్రోత్సహిస్తుంది. ప్రపంచయుద్ధ ప్రమాదాన్ని అధికంచేస్తుంది.

ఇటీవలి సంవత్సరాలలో, కొందరు వ్యక్తులు, జాతీయ విముక్తి యుద్ధంనుండి గాని, విప్లవ ప్రజాయుద్ధంనుండి గాని ఒక నిప్పురవ్వ అయినా మానవజాతిని నాశనంచేసే ప్రపంచ మారణహోమానికి దారితీయ గలదనే వాదనను వ్యాపింపజేస్తున్నారు. వాస్తవాలేమిటి? రెండవ ప్రపంచ యుద్ధానంతరం జరిగిన జాతీయవిముక్తి యుద్ధాలు, విప్లవ ప్రజా యుద్ధాలు ప్రపంచయుద్ధానికి దారితీయ లేదనేది ఈ వ్యక్తులు చెప్పేదానికి విరుద్ధం. ఈ విప్లవ యుద్ధాల విజయం సామ్రాజ్యవాద శక్తులను ప్రత్యక్షంగా బలహీనపరచింది. ప్రపంచయుద్ధం తీసుకురాకుండా సామ్రాజ్య వాదులను నిరోధించే, ప్రపంచ శాంతిని బలపరిచే శక్తులను చాలా పటిష్ఠం చేసింది. అలాంటప్పుడు ఈ వాదన ఎంత మోసపూరితమైనదో వాస్తవాలు రుజువుచేయడం లేదా?

(15) అణ్వాయుధాలను పూర్తిగా నిషేధించడం, నాశనం చేయడం ప్రపంచశాంతి పరిరక్షణకు జరిగే పోరాటంలో ప్రధాన కర్తవ్యం. ఇందు కోసం మనం శాయశక్తులా కృషిచేయాలి.

అణ్వాయుధాలు కని విని ఎరుగనంతటి నష్టం కలిగిస్తాయి. అందు చేతనే ఇప్పటికి పదేళ్ళకుపైగా అమెరికా సామ్రాజ్యవాదులు అణ్వాయుధా లతో బెదరించే విధానాన్ని అనుసరిస్తున్నారు. అన్నిదేశాల ప్రజలను బాని సత్వంలో ముంచి ప్రపంచాధిపత్యం సంపాదించాలనే కోర్కెను సిద్ధింప జేసుకోవడం వారి ఉద్దేశం.

అయితే సామ్రాజ్యవాదులు అణ్వాయుధాలతో ఇతర దేశాలను బెదిరిస్తున్నారంటే, తమ స్వదేశంలోని ప్రజలను అదే విధమైన బెదిరింపుకు గురి చేస్తున్నారన్నమాట. ఈ విధంగానే వారిని అణ్వాయుధాలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాదుల దురాక్రమణ, యుద్ధ విధానాలకు వ్యతిరేకంగా తయారుచేస్తున్నారన్నమాట. ఇదే సందర్భంలో, అణ్వాయుధాలతో తమ ప్రత్యర్థులను నాశనం చెయ్యాలనే అడియాసతో, సామ్రాజ్యవాదులు వాస్తవంలో స్వయంగానే తుడిచిపెట్టుకుపోయే ప్రమాదాన్ని తెచ్చిపెట్టుకొంటున్నారు.

అణ్వాయుధాలను నిషేధించే అవకాశం లేనిమాట నిజమే. అయినప్పటికి, అణ్వాయుధాల నిషేధానికై సామ్రాజ్యవాదులు తప్పనిసరిగా ఒక ఒప్పందానికి రావలసివస్తే, అది వారికి "మానవ జాతిపట్ల ఉన్నప్రేమ" చేతకాకుండా, అన్ని దేశాల ప్రజల వొత్తిడి, తమప్రధాన ప్రయోజనాల కారణంగానే అనేది నిశ్చయం.

సామ్రాజ్యవాదులవలె కాకుండా, సోషలిస్టుదేశాలు ప్రజలయొక్క నిజమైన బలంపైన, తమ సరైన విధానాలపైన ఆధారపడతాయి. అవి అంతర్జాతీయ రంగంలో అణ్వాయుధాలతో జూదం ఆడవలసిన అవసరం లేనేలేదు. సోషలిస్టు దేశాలకు అణ్వాయుధాలు ఉన్నాయంటే, ఆత్మరక్షణకు, అణుయుద్ధం తీసుకురాకుండా సామ్రాజ్యవాదాన్ని నిరోధించడానికి మాత్రమే.

మార్క్సిస్టు-లెనినిస్టుల దృక్పథంలో, ప్రజలే చరిత్రనిర్మాతలు. గతంలోవలె నేడుకూడా మానవుడే నిర్ణాయకశక్తి. సాంకేతిక విజ్ఞానరంగంలో పరివర్తనకు మార్క్సిస్టు-లెనినిస్టులు ప్రాధాన్యత ఇస్తారు. అయితే మానవుని పాత్రను కించపరచి, సాంకేతిక విజ్ఞానపాత్రకు ఆధిక్యత కల్పించడం తప్పు.

అణ్వాయుధాల ఆవిర్భావం మానవచరిత్ర పురోగతిని అడ్డగించజాలదు, సామ్రాజ్యవాదవ్యవస్థ రూపుమాసిపోకుండా కాపాడజాలదు. గతంలో మారణాంతక పద్ధతులు ఎన్ని ప్రవేశపెట్టినా సామ్రాజ్యాలను రూపుమాసిపోకుండా కాపాడలేకపోయాయి.

అణ్వాయుధాల అవతరణ సమకాలిక ప్రపంచంలో మౌలికమైన వైరుధ్యాలను పరిష్కరించడమూలేదు, పరిష్కరించనూలేదు; వర్గపోరాట నియమాన్ని తలక్రిందులు చేయడమూలేదు, చేయనూలేదు; సామ్రాజ్య వాదంయొక్క, అభివృద్ధి నిరోధకత్వంయొక్క స్వభావాన్ని మార్చడమూ లేదు, మార్చనూలేదు.

కాబట్టి, అణ్వాయుధాల అవతరణతో సామాజిక, జాతీయ విప్ల అవకాశమూ, అవసరమూ అదృశ్యమైపోయిందని గాని, మార్క్సిజం-లెనినిజంయొక్క మౌలికసూత్రాలకు, ముఖ్యంగా కార్మికవర్గ విప్లవం, కార్మికవర్గ నియంతృత్వం, యుద్ధమూ-శాంతిసూత్రాలకు కాలదోషం పట్టిందని, అవి బూజుపట్టిన "పిడిసూత్రాలు"గా మారిపోయినవనిగాని చెప్ప కూడదు.

(16) సోషలిస్టు దేశాలు, పెట్టుబడిదారీ దేశాలతో శాంతియుత సహజీవనం కొనసాగించటం సాధ్యమేననే సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టినవాడు లెనిన్. సోవియట్ మహాప్రజలు విదేశ సాయుధజోక్యాన్ని తిప్పికొట్టిన తర్వాత సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ, సోవియట్ ప్రభుత్వము మొదట్లో లెనిన్ నాయకత్వాన, ఆ తర్వాత స్టాలిన్ నాయకత్వాన, శాంతియుత సహజీవన విధానాన్ని నిలకడగా అనుసరించారనే విషయం, జర్మని సామ్రాజ్యవాదులు దాడిచేసినప్పుడు మాత్రమే ఆత్మరక్షణకోసం వారు యుద్ధం చేయవలసి వచ్చిందనే విషయం ప్రపంచానికి తెలుసు.

చైనా ప్రజారిపబ్లిక్ ఏర్పడినప్పటినుండి, అదికూడా రకరకాల సామాజిక వ్యవస్థలుగల దేశాలతో శాంతియుత సహజీవన విధానాన్ని నిలకడగా అనుసరించింది. శాంతియుత సహజీవనానికి సంబంధించి పంచశీలసూత్రాలను ప్రవేశపెట్టింది చైనాయే.

అయినప్పటికీ, కొద్ది సంవత్సరాల క్రితం, కొందరు వ్యక్తులు ఆకస్మికంగా, లెనిన్ శాంతియుత సహజీవన విధానాన్ని తామే ప్రతిపాదించినట్లు, దానిని వారొక్కరే కనిపెట్టినట్లు చెప్పుకొన్నారు. ఈ విధానాన్ని విపులంగా వ్యాఖ్యానించడం తమ గుత్తసొమ్మే అయినట్లు వారు వాదిస్తున్నారు. "శాంతియుత సహజీవనం" అంటే ఆకాశంనుండి ఊడిపడ్డ సర్వరోగ నివా

రిణిగా వారు చిత్రిస్తున్నారు. ప్రపంచ ప్రజలు పోరాటంద్వారా సాధించే ప్రతి విజయాన్నీ దీనికే అంటగడుతున్నారు. అంతేకాదు; లెనిన్ దృక్పథాలకు తాముచేసే వక్రభాష్యాలతో ఏకీభవించని వారినందరినీ శాంతియుత సహజీవనానికి శత్రువులుగా,లెనిన్‌ను లెనినిజాన్ని బొత్తిగా ఎరుగని అవివేకు[illegible]. సమయం దొరికినప్పుడు చురకలు తగిలించదగిన వితండవాదులుగా [illegible]న్నారు.

చైనా కమ్యూనిస్టులు ఈ దృక్పథంతో, ఈ పద్ధతితో ఎలా ఏకీభవించగలరు? వారు ఏకీభవించలేరు. ఇది అసాధ్యమైన విషయం.

లెనిన్ శాంతియుత సహజీవన సూత్రం చాలా స్పష్టంగా సామాన్య ప్రజలు అవగాహన చేసుకొనే విధంగా ఉంది. శాంతియుత సహజీవనం రకరకాల సామాజిక వ్యవస్థలుగల దేశాలమధ్య సంబంధాన్ని సూచిస్తుంది. దీనికి తమ ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యానం చెప్పకూడదు. పీడిత జాతులకు పీడకజాతులకు మధ్య, పీడితదేశాలకు - పీడకదేశాలకు మధ్య, లేదా పీడిత వర్గాలకు, పీడక వర్గాలకు మధ్య, సంబంధాలకు వర్తించేట్లు దీనిని ఎప్పటికీ విస్తరింపజేయకూడదు. పెట్టుబడిదారీ విధానంనుండి సోషలిజానికి పరివర్తనలో ప్రాధాన్యత వహించే విషయమని దీనిని ఎప్పటికీ వర్ణించకూడదు. సోషలిజానికి మానవజాతి పంథా "శాంతియుత సహజీవనము" అని నొక్కి చెప్పడం అంతకంటే తగదు. కారణమేమిటంటే, రకరకాల సామాజిక వ్యవస్థలుగల దేశాలమధ్య శాంతియుత సహజీవనాన్ని ఆచరించడం ఒక ఎత్తు. శాంతియుత సహజీవనాన్ని ఆచరిస్తున్న దేశాలు ఒకదాని సామాజిక వ్యవస్థలో మరొకటి జోక్యం కల్పించుకోవడం ఎంతమాత్రం అనుమతింపదగింది కాదు. అది పూర్తిగా అసాధ్యమైన విషయం. వివిధ దేశాలలో వర్గపోరాటం జాతీయ విముక్తికోసం పోరాటం, పెట్టుబడిదారీ విధానంనుండి సోషలిజానికి పరివర్తన ఇంకో ఎత్తు. అవన్నీ సామాజిక వ్యవస్థను మార్చడానికి ఉద్దేశించిన కఠోర, జీవన్మరణ విప్లవ ప్రజాపోరాటాలు. ఏ దేశంలోనైనా పెట్టుబడిదారీ విధానంనుండి సోషలిజానికి పరివర్తన, ఆ దేశంలో కార్మిక వర్గవిప్లవం, కార్మికవర్గ నియంతృత్వంద్వారా మాత్రమే సాధ్యంకాగలదు.

శాంతియుత సహజీవన విధానాన్ని వర్తింప చేయడంలో, రాజకీయ,

ఆర్థిక, సిద్ధాంతరంగాలలో సోషలిస్టు, సామ్రాజ్యవాద దేశాలమధ్య పోరాటాలు తప్పనిసరి. "సర్వతోముఖ సహకారము" పొందడం పూర్తిగా అసంభవం.

సోషలిస్టు దేశాలు సామ్రాజ్యవాద దేశాలతో ఏదో ఒక విధమైన సంప్రదింపులు జరపడం అవసరమవుతుంది. సోషలిస్టు దేశాలు సరైన విధానాలకు కట్టుబడి ఉన్నందువల్ల, అన్నిదేశాల ప్రజల వత్తిడివల్ల, సంప్రదింపులద్వారా కొన్ని ఒప్పందాలు కుదుర్చుకోవడం సాధ్య[illegible] అయితే సోషలిస్టు దేశాలకు, సామ్రాజ్యవాద దేశాలకు మధ్య అ[illegible] రాజీ ఒప్పందాలను పీడితప్రజలు, పీడితజాతులు అనుసరించి, సామ్రాజ్యవాదంతోను, దానితాబేర్లతోను రాజీపడవలసిన అగత్యంలేదు. శాంతియుత సహజీవనంపేరిట తమ విప్లవ పోరాటాలను వదలిపెట్టమని పీడితప్రజలను, పీడితదేశాలను ఎవ్వరూ కోరకూడదు.

సోషలిస్టు దేశాలు అమలుజేస్తున్న శాంతియుత సహజీవన విధానం సోషలిస్టు నిర్మాణం నిమిత్తం, సామ్రాజ్యవాదుల దురాక్రమణ, యుద్ధ విధానాలను బట్టబయలుచేసే నిమిత్తం, దురాక్రమణను, యుద్ధాన్నికోరే సామ్రాజ్యవాద శక్తులను వేరుపరచే నిమిత్తం అంతర్జాతీయంగా శాంతియుత వాతావరణాన్ని సాధించడానికి అనుకూలంగా ఉంటుంది. కాని సోషలిస్టు దేశాల విదేశాంగ విధానంయొక్క సాధారణపంథా శాంతియుత సహజీవనానికే పరిమితమైపోతే, సోషలిస్టు దేశాలమధ్య సంబంధాలను గాని, సోషలిస్టు దేశాలకు, పీడిత ప్రజలకు, పీడిత దేశాలమధ్య సంబంధాలనుగాని సక్రమంగా ఉంచుకోవడం అసాధ్యమవుతుంది. కాబట్టి శాంతియుత సహజీవనాన్ని సోషలిస్టు దేశాల విదేశాంగ విధానంయొక్క సాధారణ పంథాగా చేయడం తప్పు.

సోషలిస్టు దేశాల విదేశాంగ విధానంయొక్క సాధారణ పంథా ఈ దిగువ విధంగా ఉండాలని మా అభిప్రాయం. కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రం ప్రకారం సోషలిస్టు శిబిరంలోని స్నేహసంబంధాలను, పరస్పర సహాయాన్ని సహకారాన్ని పెంపొందించుకోవడం; పంచశీల సూత్రాల ప్రాతిపదికపై, రకరకాల సామాజిక వ్యవస్థలుగల దేశాలతో శాంతియుత

సహజీవనానికి కృషిచేయడం, సామ్రాజ్యవాదుల దురాక్రమణ, యుద్ధ విధానాలను వ్యతిరేకించడం; పీడిత ప్రజలందరి, పీడిత దేశాలన్నిటి విప్లవ పోరాటాలకు తోడ్పాటు, సహాయం అందజేయడము. ఈ మూడు విషయాలు పరస్పర సంబంధంకలిగి, విడదీయరానివిగా ఉన్నాయి. ఇందులో ఏ ఒక్క అంశాన్ని తొలగించకూడదు.

(17) కార్మికవర్గం అధికారాన్ని హస్తగతం చేసుకొన్న తర్వాత సుదీర్ఘమైన చారిత్రకదశదాకా, మానవుని ఇష్టాయిష్టాలతో నిమిత్త [illegible] వర్గపోరాటం ఒక భౌతిక నియమంగా కొనసాగుతుంది. అధికారాన్ని హస్తగతం చేసుకోకపూర్వం ఉన్న పద్ధతిలో మాత్రమే మార్పు ఉంటుంది.

అక్టోబరు విప్లవానంతరం లెనిన్ ఈ దిగువ విషయాలను పదేపదే హెచ్చరించాడు.

అ) అధికారం నుండి దింపివేయబడిన దోపిడీదార్లు తాము కోల్పోయిన "స్వర్గాన్ని" తిరిగి రాబట్టుకోవడానికి శతవిధాల నిరంతరం ప్రయత్నిస్తారు.

ఆ) పెట్టుబడిదారీ విధానంయొక్క నూతనశక్తులు పెటీ-బూర్జువా వాతావరణంలో ఎడతెగకుండా, తమంతట తామే పుట్టుకొస్తుంటాయి.

ఇ) బూర్జువావర్గయొక్క పలుకుబడి, పెటీబూర్జువా వర్గంచే వ్యాపింపజేయబడిన కలుషిత వాతావరణం ఫలితంగా రాజకీయ పతితులు, నూతన బూర్జువా శక్తులు కార్మిక కార్యకర్తలలోను, ప్రభుత్వ ఉద్యోగులలోను బయలుదేరవచ్చు.

ఈ) సోషలిస్టు దేశంలోపల వర్గపోరాటాన్ని కొనసాగించడానికి బాహ్యపరిస్థితులు ఏవంటే: అంతర్జాతీయ పెట్టుబడిదారీ విధానం వలయం పన్ని ఉండటం, సామ్రాజ్యవాదులు సాయుధజోక్యం కల్పించుకొనే ప్రమాదం, శాంతియుత విభజనలో విజయసాధనకై వారి విచ్ఛిన్న కార్యకలాపాలు.

లెనిన్ చేసిన ఈ నిర్ణయాలను జీవితానుభవం ధ్రువపరచింది.

సోషలిస్టు పారిశ్రామికీకరణ, వ్యవసాయిక సమిష్టీకరణ తర్వాత దశా

ణ్డాలపాటు లేదా ఇంకా ఎక్కువకాలంపాటు, ఏ సోషలిస్టు దేశమైనా, లెనిన్ పదేపదే ఖండించిన బూర్జువా తాబేదార్లు, పరాన్నభుక్కులు, చట్టావ్యాపారులు, (స్పెక్యులేషన్) జేబుదొంగలు, సోమరిపోతులు, రౌడీలు, ప్రభుత్వ ధనాన్నికాజేసే వారివంటి శక్తులనుండి విముక్తి పొందుతుందని గాని; లెనిన్ చెప్పినట్లు "పెట్టుబడిదారీ విధానంనుండి సోషలిజానికి సంక్రమించిన ఈ అంటు జాడ్యాన్ని, ఈ ప్లేగును, ఈ కురుపును" జయించే కర్తవ్యాన్ని ఒక సోషలిస్టు దేశం నెరవేర్చవలసిన అవసరం ఉండబోదని. పెట్టగల స్థితిలో ఉంటుందనిగాని చెప్పడం అసంభవం.

ఒక సోషలిస్టు దేశంలో, సోషలిజమా? లేక పెట్టుబడిదారీ విధానమా? ఇందులో ఏదిజయిస్తుందనే సమస్యను క్రమంగా పరిష్కరించడానికి చాలా సుదీర్ఘ చారిత్రకకాలం పడుతుంది. సోషలిస్టు పంథాకు, పెట్టుబడిదారీ పంథాకుమధ్య పోరాటం ఈ యావత్తు చారిత్రక కాలంలో కొనసాగుతుంది. ఈ పోరాటం ఒక తరంగంవలె లేస్తుంది, పడిపోతుంది; ఒక్కొక్కప్పుడు ఇది చాలా తీవ్రంగా ఉంటుంది; పోరాట పద్ధతులు ఎన్నో రకాలుగా ఉంటాయి.

"కార్మికవర్గం అధికారాన్ని హస్తగతం చేసుకోవడం విప్లవానికి ప్రారంభం మాత్రమేగాని ముగింపుకాదు" అని 1957 డిక్లరేషన్ సరిగానే పేర్కొన్నది.

కార్మికవర్గ నియంతృత్వకాలంలో వర్గపోరాటంయొక్క ఉనికిని, ఆర్థిక, రాజకీయ, సిద్ధాంతరంగాలలో సోషలిస్టు విప్లవాన్ని సంపూర్ణంగా సమాప్తం చేయవలసిన అవసరాన్ని నిరాకరించడం తప్పు. ఇది భౌతిక వాస్తవానికి అనుగుణమైనది కాదు. ఇది మార్క్సిజం-లెనినిజాన్ని ఉల్లంఘిస్తుంది.

(18) కమ్యూనిస్టు సమాజంయొక్క ఉన్నతదశ ఏర్పడటానికి ముందుకాలం యావత్తు పెట్టుబడిదారీ విధానంనుండి కమ్యూనిజానికి పరివర్తనచెందే కాలమని, కార్మికవర్గ నియంతృత్వ కాలమని మార్క్సు, లెనిన్‌లు ఇద్దరూ చెప్పారు. ఈ పరివర్తన దశలో, కార్మికవర్గ నియంతృత్వం, అంటే కార్మికవర్గ ప్రభుత్వం, స్థాపించడం, ఏకీకరణ చేయడం,

పటిష్ఠం చేయడం, చివరికి అంతరించిపోవటం అనే గతితర్క పద్ధతిలో సాగిపోతుంది.

"ది క్రిటిక్ ఆఫ్ గోథే ప్రోగ్రాం"లో మార్క్స్ ఈ సమస్యను దిగువ విధంగా పేర్కొన్నాడు: "పెట్టుబడిదారీ, కమ్యూనిస్టు సమాజాలమధ్య ఒక దాని విప్లవ పరివర్తనదశ ఇంకొక దానిలో ప్రవేశిస్తుంది. దీనికి అక్కడ కూడా, ప్రభుత్వం అంటే కార్మికవర్గ విప్లవ నియంతృత్వం తప్ప మరొకటి ... య పరివర్తన దశకు వర్తిస్తుంది." ("సెలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మార్క్స్ అండ్ ఏంగెల్స్" (రెండు సంపుటాలప్రతి). పుట 31, సంపుటం 2, 1961లో పీపుల్స్ పబ్లిషింగ్‌హౌస్ ప్రచురించింది).

కార్మికవర్గ నియంతృత్వాన్ని గూర్చి మార్క్స్ చేసిన మహాసిద్ధాంతాన్ని లెనిన్‌తరచు నొక్కిచెప్పాడు. ఈసిద్ధాంత పరిణామాన్ని, ముఖ్యంగా "ది స్టేట్ అండ్ రివల్యూషన్" అనే ప్రఖ్యాత గ్రంథంలో విపులీకరించాడు. అందులో ఆయన ఇలా వ్రాశాడు: "........కమ్యూనిజంవైపు పురోగమిస్తున్న పెట్టుబడిదారీ సమాజంనుండి కమ్యూనిస్టు సమాజానికి పరివర్తన ఒక 'రాజకీయ పరివర్తనదశ' లేనిదే అసంభవం. ఈ దశలో ప్రభుత్వం కార్మికవర్గ విప్లవ నియంతృత్వంగా మాత్రమే ఉండగలదు." ("లెనిన్ సంపూర్ణ రచనలు" పుట 446, సంపుటి 25)

ఆయన ఇంకా ఇలా చెప్పాడు. "ప్రభుత్వాన్ని గూర్చి మార్క్స్ ఉపదేశ సారాంశాన్ని, ఏకవర్గ నియంతృత్వం మొత్తంమీద ప్రతివర్గ సమాజానికి మాత్రమేకాకుండా బూర్జువావర్గాన్ని కూలద్రోసిన కార్మికవర్గానికి మాత్రమే కాకుండా వర్గరహిత సమాజంనుండి, కమ్యూనిజంనుండి పెట్టుబడిదారీ విధానాన్ని వేరుపరచే చారిత్రక దశకంతటికీ అవసరమనే అవగాహన గలవారు మాత్రమే ఆకళింపు చేసుకొంటున్నారు." ("లెనిన్ సంపూర్ణ రచనలు" పుట 400, సంపుటి 25)

పైన పేర్కొన్నట్లు, మార్క్స్, లెనిన్‌ల మౌలిక సిద్ధాంతం ఏమిటంటే, కార్మికవర్గ నియంతృత్వం, పెట్టుబడిదారీ విధానంనుండి కమ్యూనిజానికి పరివర్తన చెందే చారిత్రక దశకంతటికీ, అంటే, వర్గభేదాలన్నీ

రద్దు అయి, వర్గరహిత సమాజంలో, కమ్యూనిస్టు సమాజంయొక్క ఉన్నత దశలో ప్రవేశించే వరకుగల దశకంతటికీ అనివార్యంగా వర్తిస్తుంది.

సగందారిలో ఉండగానే, కార్మికవర్గ నియంతృత్వం ఇకమీదట, అవసరంలేదని ప్రకటిస్తే ఏమవుతుంది ?

కార్మికవర్గ నియంతృత్వాధికారాన్ని గూర్చి మార్క్స్, లెనిన్ ఉపదేశాలకు ఇది మౌలికంగానే విరుద్ధంకాదా?

"పెట్టుబడిదారీ విధానంనుండి సోషలిజానికి సంక్రమించిన ఈ అ[illegible] జాడ్యమూ, ఈ ప్లేగు, ఈ కురుపు" అభివృద్ధి చెందడానికి ఇది లైసెన్సు ఇవ్వదా?

మరొకమాటలో చెప్పాలంటే, ఇది ఎన్నో దుష్ఫలితాలకు దారితీస్తుంది. కమ్యూనిజానికి పరివర్తన అనే సమస్యే లేకుండా చేస్తుంది.

"యావన్మంది ప్రజల ప్రభుత్వం" అనేది ఉండగలదా? కార్మికవర్గ నియంతృత్వ ప్రభుత్వ స్థానంలో "యావన్మంది ప్రజల ప్రభుత్వాన్ని" ఏర్పరచడం సాధ్యమేనా?

ఇది ఒకానొక దేశంయొక్క ఆంతరంగిక వ్యవహారాలకు సంబంధించిన సమస్యకాదు. మార్క్సిజం-లెనినిజంయొక్క విశ్వజనీన సత్యానికి వర్తించే మౌలికసమస్య.

వర్గరహిత ప్రభుత్వం అనేదిగాని, వర్గాతీత ప్రభుత్వం అనేదిగాని లేదని మార్క్సిస్టు-లెనినిస్టుల అభిప్రాయం. ప్రభుత్వం ఒక ప్రభుత్వంగా ఉన్నంతకాలమూ, దానికి ఒక వర్గస్వభావం ఉండాలి; ప్రభుత్వం ఉన్నంతకాలమూ, అది "యావన్మంది ప్రజల" ప్రభుత్వంగా ఉండజాలదు. సమాజం వర్గరహితమైన వెంటనే, ప్రభుత్వం అనేది ఉండబోదు.

అప్పుడు "యావన్మంది ప్రజల ప్రభుత్వం" ఏరకంగా ఉంటుంది ?

"యావన్మంది ప్రజల ప్రభుత్వం" అనిచెప్పబడేదికొత్త విషయమేమీ కాదని మార్క్సిజం-లెనినిజంయొక్క ప్రాథమిక జ్ఞానం ఉన్నవారెవరైనా అర్థం చేసుకోగలరు. బూర్జువా ప్రతినిధులు బూర్జువాప్రభుత్వాన్ని ప్రజలందరి ప్రభుత్వం అనిగాని, "ప్రజలందరికి అధికారంఉన్న ప్రభుత్వం" అనిగాని పిలుస్తూవచ్చారు.

కొందరు వ్యక్తులు తమ సమాజం అప్పుడే వర్గరహితమైందని చెప్పవచ్చు. ఇందుకు మా సమాధానమేమిటంటే: లేదు అని. మినహాయింపు లేకుండా అన్ని సోషలిస్టు దేశాలలోను వర్గాలు, వర్గపోరాటాలు ఉన్నాయి. మిగిలిపోయిన పాత దోపిడీవర్గాలు తిరిగి ప్రవేశించడానికై ఇప్పటికి [illegible]నే ఉన్నారు. నూతన పెట్టుబడిదారీ శక్తులు నిరంతరం [illegible]తూనే ఉన్నాయి. ఇప్పటికీ పరాన్నభుక్కులు, చట్టవ్యాపారులు, సోమరిపోతులు, రౌడీలు, ప్రభుత్వ ధనాన్ని కాజేసేవారు మొదలైన వారు ఉన్నారు. అలాంటప్పుడు వర్గాలుగాని, వర్గపోరాటాలుగాని లేవని ఏలా చెప్పగలం? కార్మికవర్గ నియంతృత్వం ఇకమీదట అవసరంలేదని ఎలా చెప్పగలం?

శత్రువర్గాలను అణచివేయడంతోబాటు, సోషలిస్టు నిర్మాణదశలో, కార్మికవర్గానికి రైతాంగానికిమధ్య చక్కని సంబంధాలను ఏర్పాటుచేయడం, వారి రాజకీయ, ఆర్థికమైత్రిని పటిష్ఠంచేయడం, కార్మికునికి రైతుకు మధ్య వర్గభేదాన్ని క్రమేణా రూపుమాపడానికి తగుపరిస్థితులను సృష్టించడం కార్మికవర్గ నియంతృత్వం తప్పనిసరిగా నిర్వహించవలసిన చారిత్రక కర్తవ్యాలని మార్క్సిజం-లెనినిజం మనకు బోధిస్తుంది.

మనం ఏ సోషలిస్టుదేశంయొక్క ఆర్థికపునాదిని అయినా పరిశీలించినప్పుడు, ఎలాంటి మినహాయింపులేకుండా, అన్ని సోషలిస్టు దేశాలలో యావన్మంది ప్రజల యాజమాన్యానికి, సమిష్ఠి యాజమాన్యానికి మధ్య భేదం ఉన్నట్లు, వ్యక్తిగత యాజమాన్యంకూడా అక్కడ ఉన్నట్లు కనిపిస్తుంది. సోషలిస్టు సమాజంలో యావన్మంది ప్రజల యాజమాన్యమూ, సమిష్ఠియాజమాన్యమూ రెండువిధాలైన యాజమాన్యాలు, రెండు విధాలైన ఉత్పత్తి సంబంధాలు. సోషలిస్టు సమాజంలో యావన్మంది ప్రజల యాజమాన్యంగల వస్తూత్పత్తి సంస్థలలో పనిచేసే కార్మికులూ, సమిష్ఠి యాజమాన్యంగల వ్యవసాయ క్షేత్రాలలో పనిచేసే రైతులూ శ్రమజీవులలో రెండు వేర్వేరు వర్గీకరణల (కేటగరీలు)కు చెందుతారు. కాబట్టి, మినహాయింపు అనేదిలేకుండా అన్ని సోషలిస్టుదేశాలలో కార్మికునికి, రైతుకు మధ్య వర్గభేదం ఉంది. కమ్యూనిజంయొక్క ఉన్నత దశకు పరివర్తన

జరిగేదాకా ఈ భేదం తొలగిపోదు. అన్ని సోషలిస్టుదేశాలు తమ ప్రస్తుత ఆర్థికాభివృద్ధి స్థాయిలో కమ్యూనిజంయొక్క ఉన్నతదశకు చాలాదూరంలో ఉన్నాయి. "ప్రతి ఒక్కరూ తనశక్తికొద్దీ పనిచేయాలి, ప్రతిఒక్కరూ తన అవసరంకొద్దీ అనుభవించాలి," అనేసూత్రం ఆచరణలోకి వచ్చే ఉన్నత దశఅది. కాబట్టి, కార్మికునికి, రైతుకుమధ్య వర్గభేదాన్ని రూపుమాపడానికి చాలా సుదీర్ఘకాలం పడుతుంది. ఈ భేదాన్ని రూపుమాపేదాకా, స[...] వర్గరహితమైనదనిగాని, కార్మికవర్గ నియంతృత్వానికి అవసరం [...]పోయిందనిగాని చెప్పడం అసంభవం.

సోషలిస్టు ప్రభుత్వాన్ని "యావన్మంది ప్రజల ప్రభుత్వం" అని పిలిచేవారు మార్క్సిస్టు-లెనినిస్టు ప్రభుత్వ సిద్ధాంత స్థానంలో బూర్జువా ప్రభుత్వ సిద్ధాంతాన్ని తిరిగి ప్రవేశపెట్ట జూస్తున్నారా? కార్మికవర్గ నియంతృత్వ ప్రభుత్వ స్థానంలో వేరే స్వభావంగల ప్రభుత్వాన్ని తిరిగి ప్రవేశపెట్ట జూస్తున్నారా?

ఇదేనిజమైతే, ఇదొక గొప్పచారిత్రక తిరోగమనం తప్ప మరేమీ కాదు. యుగోస్లావియాలో సామాజిక వ్యవస్థకుపట్టిన ఐదశ క్షి ఒకపెద్ద గుణపాఠం.

(19) కార్మికవర్గ పార్టీ సోషలిస్టుదేశాలలో కార్మికవర్గ నియంతృత్వంతో కలసి ఉండాలని లెనినిజం బోధిస్తుంది. కార్మికవర్గ పార్టీ కార్మిక వర్గ నియంతృత్వంయొక్క చారిత్రకదశకంతటికీ వర్తిస్తుంది. కారణమేమిటంటే, కార్మికవర్గ నియంతృత్వం కార్మికవర్గంయొక్క, ప్రజలయొక్క శత్రువులకు వ్యతిరేకంగా పోరాడవలసి ఉంటుంది. రైతులు, తదితర చిన్న ఉత్పత్తిదార్లలో పునఃచైతన్యం కలిగించవలసి ఉంటుంది. కార్మిక వర్గ కార్యకర్తలను నిరంతరం ఐక్యపరచవలసి ఉంటుంది. సోషలిజాన్ని నిర్మించి, కమ్యూనిజానికి పరివర్తన చెందించవలసి ఉంటుంది. కార్మిక వర్గ పార్టీ నాయకత్వం లేనిదే ఈ పనులలో ఏ ఒక్కటి జరగదు.

"యావన్మంది ప్రజల పార్టీ" అనేది ఉండటం సాధ్యమేనా? కార్మిక వర్గానికి అగ్రగామిగా నిలబడే పార్టీ స్థానంలో "యావన్మంది ప్రజల పార్టీ"ని ప్రవేశపెట్టడం సాధ్యమేనా?

ఇదికూడా ఒకానొక పార్టీయొక్క ఆంతరంగిక వ్యవహారాలకు సంబంధించిన సమస్యకాదు. పై పెచ్చు మార్క్సిజం-లెనినిజంయొక్క విశ్వజనీన సత్యానికి వర్తించే మౌలిక సమస్య.

వర్గరహిత, వర్గాతీత రాజకీయపార్టీ అనేది ఉండదని మార్క్సిస్టు-లెనినిస్టుల అభిప్రాయం. అన్ని రాజకీయ పార్టీలకు వర్గస్వభావం ఉంటుంది. వర్గస్వభావంయొక్క కేంద్రీకృత వ్యక్తీకరణే పార్టీలో మూర్తీ[illegible]ది.

ప్రజలందరి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించగల పార్టీ కార్మిక వర్గపార్టీ మాత్రమే. అది ఆ విధంగా చేయగలదు. ఎందుకంటే అది కార్మిక వర్గ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. వారి ఆశయాలను, అభీష్టాన్ని కేంద్రీకరిస్తుంది. అది ప్రజలందరికి నాయకత్వం వహించగలదు. ఎందుకంటే మానవజాతి అంతా బాగుపడినప్పుడు మాత్రమే కార్మికవర్గం బాగుపడగలదు. ఎందుకంటే కార్మికవర్గం స్వభావసిద్ధంగానే, వివిధ సమస్యలను తన వర్తమాన, భవిష్యత్ ప్రయోజనాల దృష్ట్యా తన పార్టీ పరిశీలించేట్లు చేయగలదు. ఎందుకంటే ప్రజలకు ఆ పార్టీ ఎంతో నిజాయితీగా ఉంటుంది. స్వార్థత్యాగ భావంకలిగి ఉంటుంది. అందుచేత దానిలో ప్రజాస్వామ్యములో కేంద్రీకరణ, కఠినతరమైన క్రమశిక్షణ ఉంటాయి. అలాంటిపార్టీ లేనిదే, కార్మికవర్గ నియంతృత్వాన్ని నిలబెట్టడం, ప్రజలందరి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించడం అసంభవం.

కమ్యూనిస్టు సమాజంయొక్క ఉన్నతదశలో ప్రవేశించడానికి ముందు, సగందారిలో ఉండగానే, కార్మికవర్గ పార్టీ "యావన్మంది ప్రజల పార్టీగా" తయారైందని ప్రకటిస్తే, దాని కార్మికవర్గ స్వభావాన్ని నిరాకరిస్తే, ఏమవుతుంది?

కార్మికవర్గ పార్టీనిగూర్చి మార్క్సు, లెనిన్‌లు ఇచ్చిన ఉపదేశాలకు ఇది మౌలికంగానే విరుద్ధంకాదా?

ఇది కార్మికవర్గాన్ని, శ్రామిక ప్రజానీకాన్ని, నిర్మాణరీత్యా, సిద్ధాంత రీత్యా నిరాయుధంచేయదా? ఇది పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించడానికి తోడ్పడినట్లు కాదా?

ఇలాంటి పరిస్థితులలో కమ్యూనిస్టు సమాజానికి పరివర్తన చెందడం గూర్చి మాట్లాడటమంటే, "రథాన్ని ఉత్తరదిశగా నడుపుతూ, దక్షిణదిశకు పోతున్నట్లు" చెప్పటం కాదా?

(20) నాయకులు, పార్టీ, వర్గమూ, ప్రజలపరస్పర సంబంధాన్ని గూర్చి లెనిన్ ఇచ్చిన సాటిలేని ఉపదేశాలను, గతకొద్ది సంవత్సరాలుగా కొందరు వ్యక్తులు ఉల్లంఘించి, "వ్యక్తిపూజను రూపుమాపే" స లేవనెత్తారు; ఇదితప్పు, హానికరం.

లెనిన్ ప్రతిపాదించిన సిద్ధాంతం ఈ దిగువ విధంగా ఉంది:

అ) ప్రజలు వర్గాలుగా విభజింపబడి ఉన్నారు.

ఆ) వర్గాలు మామూలుగా రాజకీయపార్టీలచే నడపబడతాయి.

ఇ) రాజకీయపార్టీలు, సాధారణంగా, అతిసమర్థులైన, ప్రతిభావంతులైన అనుభవజ్ఞులైన వారితో కూడిన, ఇంచుమించు స్థిరత్వంగల గ్రూపులద్వారా నడపబడతాయి. వీరు చాలా బాధ్యతాయుతమైన పదవులకు ఎన్నికై, నాయకులని పిలువబడతారు.

"ఇదంతా ప్రాథమికమైనద"ని లెనిన్ చెప్పాడు.

కార్మికవర్గ పార్టీ విప్లవంలోను, పోరాటంలోను కార్మిక వర్గానికి కేంద్రంగా ఉంటుంది. ప్రతి కార్మికవర్గపార్టీ ప్రజాస్వామ్యంపై ఆధారపడిన కేంద్రీకరణను ఆచరణలో పెట్టాలి. అది సంఘటితమైన, పోరాట అర్హతగల అగ్రగామిగా తయారయ్యేముందు, పటిష్ఠవంతమైన మార్క్సిస్టు-లెనినిస్టు నాయకత్వాన్ని స్థాపించుకోవాలి. "వ్యక్తిపూజను రూపుమాపే" సమస్యను లేవనెత్తడమంటే, వాస్తవంలో నాయకులను వ్యతిరేకించమని ప్రజలకు చెప్పడమే అవుతుంది. ప్రజాస్వామ్యయుత కేంద్రీకరణపై ఆధారపడినపార్టీ ఐక్యనాయకత్వాన్ని బలహీనపరచడమే అవుతుంది. దాని పోరాటశక్తిని వ్యర్థపరచడమే అవుతుంది. దాని కార్యకర్తలను చెల్లాచెదరు చేయడమే అవుతుంది.

నాయకులను వ్యతిరేకించమని ప్రజలకు చెప్పేతప్పు దృక్పథాలను లెనిన్ విమర్శించాడు. అవి "హాస్యాస్పదమైనవి, మూర్ఖత్వంతోకూడినవి" అని పేర్కొన్నాడు.

చైనా కమ్యూనిస్టుపార్టీ వ్యక్తిపాత్రకు అధిక్యత కల్పించడాన్ని ఎల్లప్పుడూ వ్యతిరేకిస్తూవచ్చింది. పార్టీలోపల కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని బలపరచుతూ, తు.చ. తప్పకుండా ఆచరణలో పెడతూవచ్చింది. నాయకత్వానికి ప్రజానీకంతో సంబంధం ఉండాలని వాదిస్తూవచ్చింది. సరైన నాయకత్వం ప్రజలదృక్పథాలను ఎలా కేంద్రీకరించాలో తెలుసు[illegible]ని చెబుతూవచ్చింది.

[illegible]ందరు వ్యక్తులు "వ్యక్తిపూజ" అనబడే దానిని గట్టిగా రూపుమాపాలని చెపుతూనే వాస్తవంలో కార్మికవర్గ పార్టీని, కార్మికవర్గ నియంతృత్వాన్ని అపఖ్యాతిపాలు చేయడానికి తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఇదే సందర్భంలో, వారు కొందరు వ్యక్తులపాత్రను ఆకాశానికి ఎత్తుతున్నారు, తప్పులన్నీ ఇతరుల నెత్తికియెత్తి, మంచిపనులన్నీ తమవేనని చెప్పుకొంటున్నారు.

చాలా తీవ్రమైన విషయం ఏమిటంటే, "వ్యక్తిపూజను రూపుమాపే" నెపంతో, కొందరు వ్యక్తులు మొరటుగా ఇతర సోదరపార్టీల, సోదరదేశాల ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం కల్పించుకొంటున్నారు. తమ తప్పుడు పంథాను ఇతర సోదరపార్టీలపై రుద్దేనిమిత్తం, వాటి నాయకత్వాన్ని మార్చవలసిందిగా ఆ పార్టీలపై వత్తిడి తెస్తున్నారు. ఇందతా పెద్దరాజ్యం అనే జాతిదురహంకారం, ఒంటెత్తుపోకడ, చీలికవాదం కాకపోతే మరేమిటి? ఇదంతా విద్రోహం కాకపోతే మరేమిటి?

నాయకులూ, పార్టీ, వర్గమూ, ప్రజల పరస్పర సంబంధాన్ని గూర్చి లెనిన్ ఇచ్చిన సాటిలేని ఉపదేశాలను తీవ్రంగా, సమగ్రంగా ప్రచారం చేయవలసిన సమయం అసన్నమైంది.

(21) సోషలిస్టు దేశాలమధ్య సంబంధాలు ఒక నూతన విధమైన అంతర్జాతీయ సంబంధాలు. సోషలిస్టు దేశాలు చిన్నవైనా పెద్దవైనా, ఆర్థికంగా ఎక్కువ అభివృద్ధి చెందినవైనా, తక్కువ అభివృద్ధి చెందినవైనా, వాటిమధ్య సంబంధాలు సంపూర్ణ సమానత్వం; భౌగోళిక సమగ్రత, సార్వభౌమత్వం, స్వాతంత్ర్యంపట్ల గౌరవం; ఒకరి ఆంతరంగిక వ్యవహారాలలో మరొకరు జోక్యం కల్పించుకోకుండా ఉండటం అనే సూత్రాలపై

అధారపడి ఉండాలి. అంతేకాదు, కార్మికవర్గ అంతర్జాతీయతకు అను గుణంగా పరస్పర సహాయం, పరస్పర సహకారం అనే సూత్రాలపై కూడా ఆధారపడి ఉండాలి.

ప్రతి సోషలిస్టు దేశమూ తననిర్మాణం కోసం ప్రధానంగా తనపైనే ఆధారపడాలి.

తన నిర్దిష్టపరిస్థితులకు అనుగుణంగా, ప్రతి సోష[illegible] అన్నిటికంటేముందు, తన స్వంత ప్రజల సహనయుతమైన ప్ర[illegible] సామర్థ్యాలపై ఆధారపడాలి. తనకులభ్యమైన వనరులన్నిటినీ పూర్తిగా, ఒక క్రమపద్ధతిలో వినియోగించుకోవాలి. సోషలిస్టు నిర్మాణంలోకి తన యావత్తు శక్తిసంపదలను తీసుకురావాలి. ఈ విధంగా మాత్రమే అది సోషలిజాన్ని జయప్రదంగా నిర్మించగలదు, తన ఆర్థికవ్యవస్థను త్వరగా అభివృద్ధి పరచుకోగలదు.

మొత్తం సోషలిస్టు శిబిరంయొక్క శక్తిని పటిష్ఠంచేయడానికి, అంతర్జాతీయ కార్మికవర్గంయొక్క విప్లవాశయానికి తోడ్పడేశక్తిని ఇనుమ డింప జేసుకోవడానికి, ప్రతి సోషలిస్టు దేశానికి ఏకైకమార్గం ఇదే. కాబట్టి, నిర్మాణంలో ప్రధానంగా స్వశక్తిపై ఆధారపడాలనే సూత్రాన్ని పాటించడ మంటే, కార్మికవర్గ అంతర్జాతీయతను నిర్దిష్టంగా వర్తింపజేయడమే అవు తుంది.

ఏ సోషలిస్టు దేశమైనా, తన స్వంతపాక్షిక ప్రయోజనాలతో మాత్రమే బయలుదేరి, తన అవసరాలకు ఇతర సోదరదేశాలు తలవొగ్గాలని ఏకపక్షంగాకోరితే, తమ నిర్మాణంలో ప్రధానంగా స్వంతకృషిపై ఆధార పడాలనే సూత్రాన్ని వర్తింపజేయనివ్వకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై తమ ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి చేసుకోనివ్వకుండా ఇతర సోదరదేశాలను నిరోధించే నిమిత్తం, "ఏకాకి అయిపోతున్నది," "జాతీయతత్వం" అనే పేర్లు పెట్టి, వ్యతిరేకించడానికి సాకుచూపితే, లేదా చివరికి ఇతర సోదర దేశాలపై ఆర్థికవొత్తిడి తెచ్చేవరకూ వెళ్ళితే-ఇవి జాతీయ దురహంకారానికి చక్కని ఉదాహరణలు అవుతాయి.

సోషలిస్టు దేశాలు పరస్పరం ఆర్థికంగా తోడ్పాటు, సహకారం, ఇచ్చి

పుచ్చుకోవడాన్ని ఆచరణలో పెట్టడం చాలా అవసరం. ఇలాంటి ఆర్థిక సహకారం సంపూర్ణ సమానత్వం పరస్పరలాభం, కామ్రేడ్స్ ఇచ్చిపుచ్చుకునే సహకారసూత్రాలపై ఆధారపడి ఉండాలి.

ఈ మౌలిక సూత్రాలను నిరాకరించడమంటే "అంతర్జాతీయ శ్రమ [illegible] విభజన" పేరుతోగాని, "ప్రత్యేక నైపుణ్యసంపాదన" పేరుతోగాని [illegible]న్ని ఇతరులపై రుద్దడం, సోదరపార్టీల స్వాతంత్ర్యాన్ని, [illegible]మత్వాన్ని అతిక్రమించడమంటే, ఇది పెద్దరాజ్యమనే జాతిదురహంకార మనిపించుకొంటుంది.

సోషలిస్టు దేశాలమధ్య సంబంధాలలో, పెట్టుబడిదారీ దేశాలమధ్య సంబంధాలలోవలె, ఇతరులను నష్టపెట్టి తాను లాభపడే పద్ధతిని అనుసరించడంగాని, మార్కెట్లను తమ గుప్పెట్లోపెట్టుకొని లాభాలు కుప్పబోనుకోవాలనే ఉద్దేశంతో గుత్తపెట్టుబడిదారీ గ్రూపులు స్థాపించిన "ఆర్థిక సమైక్యత," "ఉమ్మడి మార్కెట్"లను, సోషలిస్టు దేశాలు తమ ఆర్థిక సహకారం, పరస్పర సహాయంలో ఆదర్శంగా స్వీకరించాలనేదాకా వెళ్ళడంగాని హాస్యాస్పదంగా ఉంటుంది.

(22) 1957 డిక్లరేషన్‌లో 1960 స్టేట్‌మెంట్‌లో సోదర పార్టీల మధ్య సంబంధాలకు తోడ్పడే సూత్రాలు రూపొందింపబడి ఉన్నాయి. ఇవి: సౌభ్రాతృత్వ సూత్రం, ఒకరికొకరు తోడ్పాటు ఒకరికొకరు సహాయసూత్రం, స్వాతంత్ర్యం సమానత్వసూత్రం, సంప్రదింపుల ద్వారా ఏకాభిప్రాయానికి వచ్చే సూత్రం. ఇవన్నీ మార్క్సిజం-లెనినిజంపైన, కార్మికవర్గ అంతర్జాతీయతపైన ఆధారపడి ఉన్నాయి.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ మార్చి 30వ తేదీన వ్రాసిన లేఖలో, కమ్యూనిస్టు ఉద్యమంలో "ఎక్కువ," "తక్కువ" పార్టీలు లేవని, అన్ని కమ్యూనిస్టుపార్టీలు స్వతంత్రమైనవి, సమానమైన హోదాకలవని, కార్మికవర్గ అంతర్జాతీయత, పరస్పర సహాయం ప్రాతిపదికపై అవన్నీ తమ సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పిన విషయాన్ని మేము గుర్తిస్తున్నాం.

తమ చేతలలోను, మాటలలోను నిలకడగా ఉండటమనేది కమ్యూ నిస్టుల సుగుణం. సోదర పార్టీలమధ్య ఐక్యతను కాపాడటానికి, పటిష్ఠం చేయడానికి సరైన ఏకైకమార్గం ఏదంటే: కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రాన్ని ఉల్లంఘించకుండా చిత్తశుద్ధితో పాటించడం, సోదర పార్టీల మధ్య సంబంధాలకు తోడ్పడే సూత్రాలను కాలరాయకుండా చిత్తశుద్ధితో అమలు జరపడం. వీటిని మాటలలో మాత్రమే కాకుండా, చే[illegible] జరపడం చాలా ముఖ్యం.

సోదర పార్టీలమధ్య సంబంధాలలో స్వాతంత్ర్యం, స[illegible] సూత్రాన్ని అంగీకరించినప్పుడు, ఏ పార్టీగాని ఇతరులకంటే తాను ఎక్కువ అనుకోవడం, వారి ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం కల్పించుకోవడం, వారితో సంబంధాలలో పెత్తందారీ పద్ధతులను అవలంబించడం అనుమతింపరానిది.

సోదర పార్టీలమధ్య సంబంధాలలో "ఎక్కువలు," "తక్కువలు" లేవని అంగీకరించినప్పుడు, ఒక పార్టీ తన స్వంత కార్యక్రమాన్ని, తీర్మానాలను, పంథాను అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క "ఉమ్మడి పంథా" అని చెప్పి ఇతర పార్టీలపై రుద్దడం అనుమతింపరానిది.

సోదర పార్టీలమధ్య సంబంధాలలో, సంప్రదింపుల ద్వారా ఏకాభిప్రాయం సాధించే సూత్రాన్ని అంగీకరించినప్పుడు, "మెజారిటీలో ఎవరు ఉన్నారు," "మైనారిటీలో ఎవరు ఉన్నారు" అని నొక్కి చెప్పకూడదు. తమ తప్పు పంథాను అమలుపరచడానికి, తమ ఒంటెత్తు పోకడలను, చీలిక వాదాన్ని కొనసాగించడానికి మెజారిటీ అనబడే దానిపై ఆధారపడకూడదు.

సోదర పార్టీలమధ్య విభేదాలను పార్టీ ఆంతరంగిక చర్చలద్వారా పరిష్కరించుకోవాలని అంగీకరించినప్పుడు, ఇతర సోదర పార్టీలను బహిరంగంగా తమ స్వంత మహాసభలలో గాని, ఇతరపార్టీ మహాసభలలోగాని, పార్టీ నాయకుల ప్రసంగాలు, తీర్మానాలు, ప్రకటనలు మొదలైన వాటి ద్వారాగాని విమర్శించకూడదు. సోదర పార్టీలమధ్యగల సిద్ధాంత విభేదాలను ప్రభుత్వ సంబంధాలకు వర్తింపజేయడం అంతకంటే తగదు.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో భేదాభిప్రాయాలు ఉన్న

నేటి పరిస్థితులలో, డిక్లరేషన్, స్టేట్‌మెంట్‌లలో రూపొందింపబడినట్లు సోదరపార్టీల మధ్య సంబంధాలకు తోడ్పడే సూత్రాలకు ఖచ్చితంగా కట్టుబడి ఉండాలని నొక్కిచెప్పడం ఎంతో అవసరమని మేము అభిప్రాయపడుతున్నాం.

సోదరపార్టీల మధ్య సంబంధాల విషయంలో, ప్రస్తుతం సోవియట్ [illegible]బంధాల సమస్య ముఖ్యమైనది. ఇక్కడ సమస్య ఏమి[illegible]ర్టీ పట్ల సోదరదేశంపట్ల అవలంబింపదగిన సరైన వైఖరి [illegible] డిక్లరేషన్-స్టేట్‌మెంట్లలో రూపొందింపబడినట్లు సోదర పార్టీల సోదర దేశాలమధ్య సంబంధాలకు తోడ్పడే సూత్రాలను పాటిస్తున్నారా లేదా అనేదే. ఈ సమస్యకు సరైన పరిష్కారమార్గం సోషలిస్టు శిబిరం యొక్క, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క ఐక్యతను కాపాడటంలో ఎదురైన ఒక ప్రధానమైన సిద్ధాంత విషయం.

మార్క్సిస్టు-లెనినిస్టు సోదరపార్టీ అయిన ఆల్బేనియా లేబర్‌పార్టీ పట్ల ఏ విధమైన వైఖరిని అవలంబించాలనేది ఒక సమస్య. మార్క్సిజం-లెనినిజానికి ద్రోహం చేసిన యుగోస్లావ్ రివిజనిస్టు ముఠాపట్ల ఏ విధమైన వైఖరి అవలంబించాలనేది పూర్తిగా మరో సమస్య. మౌలికంగానే భిన్నమైన ఈ రెండు సమస్యలను ఏ పరిస్థితులలోను సమానంగా చూడకూడదు.

"సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీకి ఆల్బేనియా లేబర్ పార్టీకి మధ్య సంబంధాలు మెరుగు కావచ్చుననే ఆశను వదలుకోవడంలేదు" అని మీరు వ్రాసిన లేఖలో పేర్కొన్నారు. అయితే ఇదే సమయంలో "విచ్ఛిన్న కార్యకలాపాలు" సాగిస్తున్నారని పేరుపెట్టి, ఆల్బేనియా కామ్రేడ్స్‌పై మీ దాడిని కొనసాగిస్తున్నారు. ఇది స్పష్టంగానే స్వవచన వ్యాఘాతమైనది. సోవియట్-ఆల్బేనియా సంబంధాల సమస్యను పరిష్కరించడానికి ఇది ఏ విధంగాను తోడ్పడదు.

సోవియట్-ఆల్బేనియా సంబంధాలలో విచ్ఛిన్న చర్యలకు దిగింది ఎవరు ?

సోవియట్-ఆల్బేనియా పార్టీల మధ్య సిద్ధాంత విభేదాలను ప్రభుత్వ సంబంధాలకు విస్తరింపజేసింది ఎవరు?

సోవియట్-ఆల్బేనియా పార్టీలమధ్య ఈ రెండుదేశాల మధ్య సంబంధాలు తెగిపోయాయనే విషయం శత్రువు ఎదుట పెట్టింది ఎవరు?

ఆల్బేనియా పార్టీలోను, ప్రభుత్వ నాయకత్వంలోను మార్పుకోసం బహిరంగంగా పిలుపు ఇచ్చింది ఎవరు ?

ఇదంతా ప్రపంచమంతటికీ తెలుసు.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీకి నాయకత్వ[illegible] కామ్రేడ్స్ సోవియట్ - ఆల్బేనియా సంబంధాలు ఇంత తీవ్రంగా [illegible] పోయినందుకు తమ బాధ్యతను వాస్తవంలో గుర్తించకుండా ఉండటం సంభవమేనా ?

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీకి నాయకత్వం వహిస్తున్న కామ్రేడ్స్, సోదరపార్టీల సోదర దేశాలమధ్య సంబంధాలకు తోడ్పడే సూత్రాలను పాటించగలరని, సోవియట్-ఆల్బేనియా సంబంధాలు మెరుగు కావడానికి తగుమార్గం అన్వేషించడంలో చొరవ తీసుకోగలరనే హృదయపూర్వకమైన విశ్వాసాన్ని మేము మరొకసారి వెల్లడిస్తున్నాం.

ఒక్కమాటలో చెప్పాలంటే, సోదరపార్టీల, సోదరదేశాలమధ్య సంబంధాలను కాపాడే సమస్యను తీవ్రంగా పరిగణించాలి. సోదరపార్టీల, సోదర దేశాలమధ్య సంబంధాలకు తోడ్పడే సూత్రాలకు గట్టిగా కట్టుబడి ఉండాలి. "మాస్కో హస్తం" గురించి సామ్రాజ్యవాదులు, అభివృద్ధి నిరోధకులు వ్యాపింపజేసిన నిందలను తిప్పికొట్టడానికి ఏకైక మార్గం ఇదే.

ఎలాంటి మినహాయింపు లేకుండా, అన్ని పార్టీలు అవి చిన్నవైనా పెద్దవైనా, అవి అధికారంలో ఉన్నా లేకపోయినా-కార్మికవర్గ అంతర్జాతీయతను అమలు జరపాలి. అయినప్పటికీ, పెద్ద పార్టీలకు అధికారంలో ఉన్న పార్టీలకు ఈ విషయంలో ప్రత్యేకంగా పెద్ద బాధ్యత ఉంటుంది. గతంలో సోషలిస్టు శిబిరంలో ఏర్పడిన అనేక బాధాకరమైన పరిణామాలు ఆయా సోదరపార్టీల ప్రయోజనాలకు మాత్రమే కాకుండా, వారి దేశాలలోని ప్రజానీకానికి కూడా హాని కలిగించాయి.

పెద్దదేశం అనే జాతి దురహంకారాన్ని ఎప్పటికీ ప్రదర్శించవద్దు

అని లెనిన్ ఇచ్చిన ఆదేశాన్ని పెద్దదేశాలు, పెద్దపార్టీలు మనస్సులో ఉంచుకోవడం అవసరమని ఇది ఖచ్చితంగా రుజువుచేస్తుంది.

"సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ సోదర చైనా ప్రజలపట్లగాని, ఇతర ప్రజలపట్లగాని, మా దేశ ప్రజలలో విరోధభావాన్ని రెచ్చగొట్టే ఎలాంటి చర్యనూ ఎప్పుడూ తీసుకోలేదని, ఎప్పటికి తీసుకో[illegible]ట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ కామ్రేడ్స్ తమ లేఖలో [illegible]న్నారు. గతంలో జరిగిన అనేక విచారకర సంఘటనలను ఇక్కడ తిరిగిచెప్పే ఉద్దేశం, ఉదహరించే ఉద్దేశం మాకులేదు. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ కామ్రేడ్స్ తమ భవిష్యత్ కార్యకలాపాలలో ఈ ప్రకటనను ఖచ్చితంగా పాటించాలని మాత్రమే మేము కోరుతున్నాం.

గత కొద్ది సంవత్సరాలలో, సోదరపార్టీల, సోదరదేశాల మధ్య సంబంధాలకు తోడ్పడే సూత్రాలను ఉల్లంఘించిన ఫలితంగా అనేక తీవ్రదుర్ఘటనలు జరిగినప్పటికి, మాకు ఎన్నో కష్ట, నష్టాలు కలిగించినప్పటికి, మా పార్టీ సభ్యులు, మా ప్రజలు ఎంతో ఓర్పువహించారు. చైనా కమ్యూనిస్టుల, చైనా ప్రజల కార్మికవర్గ అంతర్జాతీయత అగ్నిపరీక్షకు తట్టుకొని నిలబడింది.

చైనా కమ్యూనిస్టుపార్టీ కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రానికి ఖచ్చితంగా కట్టుబడి ఉంది. సోదరపార్టీల, సోదరదేశాలమధ్య సంబంధాలకు తోడ్పడే 1957 డిక్లరేషన్, 1960 స్టేట్‌మెంట్లలోని సూత్రాలను పాటిస్తుంది, బలపరుస్తుంది. సోషలిస్టు శిబిరంయొక్క, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క ఐక్యతను కాపాడుతుంది, పటిష్ఠం చేస్తుంది.

(23) సోదరపార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించిన అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ఉమ్మడి కార్యక్రమాన్ని అమలుపరచాలంటే, మార్క్సిజం-లెనినిజానికి భిన్నమైన అన్ని అవకాశవాద పద్ధతులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం జరపవలసి ఉంది.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో రివిజనిజం, మరోమాటలో చెప్పాలంటే, మితవాద అవకాశవాదం ముఖ్యమైన ప్రమాదంగా ఉందని

డిక్లరేషన్ పత్రం పేర్కొంటున్నాయి. యుగోస్లావ్ రివిజనిజం ఆధునిక రివిజనిజానికి మచ్చుతునక.

స్టేట్‌మెంట్‌లో స్పష్టంగా ఇలా పేర్కొనబడింది: "యుగోస్లావ్ అంతర్జాతీయ అవకాశవాద పద్ధతిని, కేంద్రీకృతరూపంలో ఉన్న ఆధునిక రివిజనిస్టు 'సిద్ధాంతాల' పద్ధతిని కమ్యూనిస్టు పార్టీలు ఏకగ్రీవంగా ఖండించాయి."

అందులో ఇంకా ఇలా ఉంది: "కాలదోషంపట్టిందంటూ మా... లెనినిజానికి తిలోదకాలిచ్చిన తర్వాత, యుగోస్లావ్ కమ్యూనిస్టు లీగ్ నాయకులు తమ లెనినిస్టు-వ్యతిరేక రివిజనిస్టు కార్యక్రమంతో 1957 డిక్లరేషన్‌ను ప్రతిఘటించారు; వారు యుగోస్లావ్ కమ్యూనిస్టు లీగును అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికంతటికీ వ్యతిరేకంగా నిలబెట్టారు; సోషలిస్టు శిబిరంతో తమ దేశానికి గల సంబంధాలను తెంచుకొన్నారు; దానిని అమెరికా, తదితర సామ్రాజ్యవాదుల "సహాయం"పై ఆధారపడేట్లు చేశారు...."

స్టేట్‌మెంట్‌లో ఇంకా ఇలా ఉంది: యుగోస్లావ్ రివిజనిస్టులు సోషలిస్టు శిబిరానికి, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి వ్యతిరేకంగా విచ్ఛిన్న చర్యలు కొనసాగిస్తున్నారు. వారుశిబిరాలకు అతీతం అనే సాకుతో శాంతికాముక శక్తుల, శాంతికాముక దేశాలన్నిటి ఐక్యతకు హానికలిగించే కార్యకలాపాలను చేబట్టారు.

అందుచేత, ఈ దిగువనిర్ణయం చేయబడింది. "యుగోస్లావ్ రివిజనిస్టు నాయకులను ఇంకా బట్టబయలు చేయడం, యుగోస్లావ్ రివిజనిస్టుల లెనినిస్టు వ్యతిరేక భావాలనుండి కమ్యూనిస్టు ఉద్యమాన్ని, కార్మికోద్యమాన్ని కాపాడటానికై గట్టిపోరాటం జరపడం మార్క్సిస్టు-లెనినిస్టుపార్టీల ప్రధాన కర్తవ్యంగా ఉంది."

ఇక్కడ తలెత్తిన సమస్య, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక ప్రధానమైన సిద్ధాంత సమస్య.

ఇటీవలనే టిటోముఠా, డిక్లరేషన్‌కు, స్టేట్‌మెంట్‌కు వ్యతిరేకమైన

తమ రివిజనిస్టు కార్యక్రమాన్ని, మార్క్సిస్టు-లెనినిస్టు వ్యతిరేక వైఖరిని బాహాటంగా అమలుజరపదలచినట్లు చాటి చెప్పింది.

అమెరికా సామ్రాజ్యవాదులూ, నాటో భాగస్వాములూ చాలాకాలంగా టిటోముఠాను మేపడానికి కొన్ని వందలకోట్ల అమెరికా డాలర్లు ఖర్చు పెట్టారు. "మార్క్సిస్టు-లెనినిస్టుల"నే ముసుగుతో "సోషలిస్టు దేశం" అని [illegible] టిటోముఠా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని, [illegible] విప్లవాశయాన్ని బలహీనపరుస్తున్నది; అమెరికా [illegible]జ్యవాదానికి ఒక ప్రత్యేక సాధనంగా ఉపకరిస్తున్నది.

యుగోస్లావియా "నిర్దుష్ట అనుకూల వైఖరి"ని చూపెడుతున్నదని, అది "సోషలిస్టుదేశమ"ని టిటోముఠా "సామ్రాజ్యవాద వ్యతిరేకశక్తి" అని బల్లగుద్ది చెప్పడం పూర్తిగా నిరాధారమైనది, వాస్తవానికి భిన్నమైనది.

కొందరు వ్యక్తులు ప్రస్తుతం యుగోస్లావ్ రివిజనిస్టు ముఠాను కమ్యూనిస్టు సమాజంలోకి, అంతర్జాతీయ కమ్యూనిస్టు కార్యకర్తల సమూహంలోకి ప్రవేశపెట్ట జూస్తున్నారు. ఇలా చేయడమంటే, 1960లో సోదర పార్టీల సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించిన ఒడంబడికను బహిరంగంగా చింపివేయడమన్నమాట. ఇది ఏ మాత్రమూ అనుమతింపదగిందికాదు.

గత కొద్ది సంవత్సరాలుగా, అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమాన్ని కలుషితంచేస్తున్న రివిజనిస్టుధోరణి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం పొందిన అనేక అనుభవాలు, గుణపాఠాలు, ప్రస్తుతం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ముఖ్యమైన ప్రమాదం రివిజనిజమని డిక్లరేషన్-స్టేట్‌మెంట్‌ల్లో చేసిన నిర్ణయం సరైందని పూర్తిగా ఋజువు పరచాయి.

అయినప్పటికీ, కొందరు వ్యక్తులు బహిరంగంగా, ముఖ్యమైన ప్రమాదం పిడివాదమేకాని రివిజనిజం కాదని, లేదా పిడివాదం రివిజనిజం కంటే తక్కువ ప్రమాదమైనదేమీకాదని ఇంకా ఏవేవో చెబుతున్నారు; దీనికంతటికీ ఏ రకమైన సూత్రం వర్తిస్తుంది?

నిలకడగల మార్క్సిస్టు-లెనినిస్టులు, చిత్తశుద్ధిగల మార్క్సిస్టు-లెనినిస్టుపార్టీలు సూత్రాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. వారు నేడు ఒకదానికి

రేపు ఇంకోదానికి అంగీకరిస్తూ, నేడు ఒకదానిని రేపు ఇంకోదానిని బల పరుస్తూ సూత్రాలను తాకట్టుపెట్టకూడదు.

మార్క్సిస్టు - లెనినిస్టు లందరితో బాటు, చైనా కమ్యూనిస్టులు మార్క్సిజం-లెనినిజంయొక్క పవిత్రతను, డిక్లరేషన్-స్టేట్‌మెంట్‌లోని సూత్రబద్ధవైఖరిని కాపాడే నిమిత్తం ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం కొనసాగిస్తారు.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ముఖ్యమైన ఉన్న రివిజనిజాన్ని నిర్మూలిస్తూనే, కమ్యూనిస్టులు పిడివాదాన్ని నిర్మూలించాలి.

1957 డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లు, కార్మికవర్గ పార్టీలు "విశ్వజనీన మైన మార్క్సిస్టు-లెనినిస్టు సత్యాన్ని తమ దేశాలలో విప్లవంయొక్క, నిర్మాణంయొక్క నిర్దిష్ట ఆచరణతో మేళవించే సూత్రాన్ని గట్టిగా అమలు పరచాలి."

అంటే :

ఒకవైపున విశ్వజనీన మార్క్సిస్టు-లెనినిస్టు సత్యానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉండటం అవసరం. ఆ విధంగా చేయకపోతే, మితవాద అవకాశ వాదానికిగాని రివిజనిస్టు తప్పులకుగాని దారితీస్తుంది.

మరోవైపున, వాస్తవ పరిస్థితులను బట్టే పని ప్రారంభించడం, ప్రజానీకంతో సన్నిహిత సంబంధం పెట్టుకోవడం, ప్రజాపోరాటాల అను భవాలను సమీక్షించడం, తమ దేశపరిస్థితులకు తగినట్లు విధానాలను ఎత్తు గడలను స్వతంత్రంగా రూపొందించుకోవడం వర్తింపజేయడం ఎల్లప్పుడూ అవసరం. ఆ విధంగా చేయకపోతే, మరో కమ్యూనిస్టుపార్టీ విధానాలను, ఎత్తుగడలను మక్కికిమక్కీ అనుసరిస్తే, గుడ్డిగా ఇతరుల ఇష్టానికి లొంగి పోతే ఇతర కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమాన్ని తీర్మానాలను పరిశీలించ కుండానే తమ పంథాగా అంగీకరిస్తే పిడివాద తప్పిదాలు జరుగుతాయి.

డిక్లరేషన్‌లో చాలాకాలం క్రిందటే ధ్రువపరచిన ఈ మౌలిక సూత్రాన్ని కొందరు ప్రస్తుతం ఉల్లంఘిస్తున్నారు. "మార్క్సిజం-లెని నిజాన్ని సృజనాత్మకంగా అభివృద్ధి పరుస్తున్నామ"నే సాకుతో, వారు

మార్క్సిజం-లెనినిజంయొక్క విశ్వజనీన సత్యాన్ని త్రోసిపుచ్చుతున్నారు. పై పెచ్చు, స్వకపోల కల్పితాలనే "విశ్వజనీన మార్క్సిస్టు-లెనినిస్టు సత్యాలు"గా వర్ణిస్తున్నారు. తమ మనస్సులో పుట్టిన ఊహలుతప్ప, వీటికి మరో ప్రాతిపదికలేదు. ఇవి వాస్తవానికి ప్రజలకు దూరమైనవి. ఈ స్వీయమానసిక వూహలను బేషరతుగా అంగీకరించాలని వారు ఇతరులను వత్తిడిపెడు[illegible]రు.

[illegible]చేతనే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో అనేక తీవ్ర[illegible]లు ఏర్పడ్డాయి.

(24) విప్లవంయొక్క అభివృద్ధీ విజయమూ విప్లవ కార్మికవర్గ పార్టీ ఉనికిపైనే ఆధారపడి ఉందనేది అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానుభవం నేర్పుతున్న అతిప్రధానమైన గుణపాఠం.

విప్లవపార్టీ ఒకటి ఉండాలి.

మార్క్సిజం-లెనినిజంయొక్క విప్లవ సిద్ధాంతం, విప్లవ పద్ధతికి అనుగుణంగా నిర్మింపబడిన విప్లవపార్టీ ఒకటి ఉండాలి.

మార్క్సిజం-లెనినిజంయొక్క విశ్వజనీన సత్యాన్ని తమ దేశంలో నిర్దిష్ట ఆచరణతో మేళవించగల విప్లవపార్టీ ఒకటి ఉండాలి.

వాస్తవంపట్ల శ్రద్ధాసక్తులుచూపే, తన తప్పులను సరిచేసుకొనే, విమర్శ, ఆత్మవిమర్శలను ఎలా జరపాలో తెలుసుకొనే విప్లవపార్టీ ఒకటి ఉండాలి.

ఇలాంటి విప్లవపార్టీ మాత్రమే సామ్రాజ్యవాదాన్ని, దాని తాబేదార్లను ఓడించడంలో కార్మికవర్గానికీ, విశాలమైన ప్రజానీకానికి నాయకత్వం వహించగలదు. జాతీయ ప్రజాస్వామిక విప్లవంలో సంపూర్ణవిజయం సాధించగలదు. సోషలిస్టు విప్లవాన్ని సాధించగలదు.

ఒకపార్టీ కార్మికవర్గ విప్లవపార్టీ కాకుండా, బూర్జువా సంస్కరణవాద పార్టీ అయితే;

అది మార్క్సిస్టు-లెనినిస్టుపార్టీ కాకుండా, రివిజనిస్టు పార్టీ అయితే;

అది కార్మికవర్గం అగ్రగామిపార్టీ కాకుండా, బూర్జువావర్గం వెంట, దాని తోకబుచ్చుకు వెళ్ళేపార్టీ అయితే;

అది కార్మికవర్గంయొక్క, శ్రామిక ప్రజలందరియొక్క ప్రయోజనాలకు ప్రాతినిధ్యంవహించే పార్టీకాకుండా, కార్మిక ప్రభువుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యంవహించే పార్టీ అయితే;

అది అంతర్జాతీయ తత్వంగల పార్టీకాకుండా, జాతీయ తత్వంగల పార్టీ అయితే ;

అది తీవ్రమైన పరిశోధన, పరిశీలనద్వారా తన స్వదేశవ... వర్గాల ధోరణులనుగూర్చి స్వయంగా ఆలోచించి సరైన అంచనా... డానికై తనబుర్రను ఉపయోగించగల పార్టీకాకుండా, మార్క్సిజం-లెనినిజం యొక్క విశ్వజనీన సత్యాన్ని స్వదేశంలో నిర్దిష్ట ఆచరణకు ఎలా వర్తింపచేయాలో తెలిసిన పార్టీకాకుండా, ఇతరుల మాటలను చిలుకవలె వల్లించే పార్టీ అయితే, పరిశీలన చేయకుండా విదేశ అనుభవాన్ని మక్కికిమక్కి అనుసరించే పార్టీ అయితే, విదేశాలలో కొందరు వ్యక్తుల ఆజ్ఞానుసారం అటూఇటూ పరుగులెత్తే పార్టీ అయితే, మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం మినహా రివిజనిజం, పిడివాదం వగైరా అమాంబాపతుకు ఆలవాలంగా తయారయ్యే పార్టీ అయితే ;

అలాంటి పార్టీ ఎప్పటికీ విప్లవ పోరాటంలో కార్మికవర్గానికి, ప్రజానీకానికి నాయకత్వం వహించలేదు, విప్లవాన్ని ఎప్పటికీ సాధించలేదు, కార్మికవర్గంయొక్క చారిత్రక ఆశయాన్ని ఎప్పటికీ నెరవేర్చలేదు.

మార్క్సిస్టు-లెనినిస్టులందరు, వర్గచైతన్యం గల కార్మికులందరు, సర్వత్రాగల అందరు అభ్యుదయకాముకులు లోతుగా ఆలోచించవలసిన సమస్య ఇది.

(25) అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన భేదాభిప్రాయాలను గౌరవిస్తూనే, వాస్తవమేదో, అవాస్తవమేదో వేరుచేసి చూడటం మార్క్సిస్టు-లెనినిస్టుల కర్తవ్యం. శత్రువుకు వ్యతిరేకంగా పోరాడటంకోసం ఐక్యత అవసరమనే ఉమ్మడి ప్రయోజనందృష్ట్యా, సమస్యలను పార్టీ ఆంతరంగిక చర్చలద్వారా పరిష్కరించుకోవాలని మేము ఎల్లప్పుడూ వాదిస్తూవచ్చాం, భేదాభిప్రాయాలను బహిరంగంగా శత్రువు ఎదుటికి తేవడాన్ని మేము ఎల్లప్పుడూ వ్యతిరేకిస్తూ వచ్చాం.

కొందరు సోదరపార్టీ నాయకులు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో బహిరంగ వాదోపవాదాలను రెచ్చగొట్టారని, మాపై బలవంతంగా రుద్దారని సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ కామ్రేడ్స్‌కు తెలిసే ఉంది.

బహిరంగ చర్చను రెచ్చగొట్టారు కాబట్టి సోదరపార్టీల మధ్య సమా [illegible]దికపైన, ప్రజాస్వామ్య ప్రాతిపదికపైన దీనిని నిర్వహించ [illegible]ంది. వాస్తవాలను ముందుపెట్టడం ద్వారా, విషయాలను సోదాహరణంగా రుజువుపరచడం ద్వారా దీనిని నిర్వహించవలసి ఉంది.

ఇతర సోదర పార్టీలను కొందరు పార్టీ నాయకులు బహిరంగంగా దాడిచేసి బహిరంగ చర్చను రెచ్చగొట్టారు. కాబట్టి, దాడికి గురైన సోదరపార్టీలు బహిరంగ సమాధానాలు ఇవ్వకుండా వారు నిషేధించడానికి కారణంగాని అధికారంగాని లేదని మా అభిప్రాయం.

ఇతర సోదరపార్టీలపై దాడిచేస్తూ లెక్కలేనన్ని వ్యాసాలు ప్రచురించారు కాబట్టి, అందుకు సమాధానంగా ఆ సోదర పార్టీలు వ్రాసినవ్యాసాలను తమ స్వంత పత్రికలలో ఎందుకు ప్రచురించడంలేదు ?

ఇటీవల కొంతకాలంగా, చైనా కమ్యూనిస్టుపార్టీ హాస్యాస్పదమైన దాడులకు గురి అవుతున్నది. దాడిచేసేవారు పెద్ద అల్లరి లేవదీశారు. వాస్తవాలను పరిగణించకుండా, మాకు వ్యతిరేకంగా ఎన్నో నేరాలను సృష్టించారు. మాపై దాడిచేసే ఈ వ్యాసాలను, ప్రసంగాలను మా స్వంత పత్రికలలో ప్రచురించాం.

అంతేకాదు. సుప్రీంసోవియట్ సమావేశంలో 1962 డిసెంబరు 12వ తేదీన సోవియట్ నాయకుడు ఇచ్చిన నివేదికను, 1963 జనవరి 7వ తేదీన ప్రావ్దా సంపాదకవర్గం వ్రాసిన వ్యాసాన్ని, జర్మనీ సోషలిస్టుయూనిటీ పార్టీ ఆరో మహాసభలో 1963 జనవరి 16వ తేదీన సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధివర్గ నాయకుడు చేసిన ప్రసంగాన్ని, 1963 ఫిబ్రవరి 10వ తేదీన ప్రావ్దా సంపాదకవర్గం వ్రాసిన వ్యాసాన్ని మాపత్రికలలో పూర్తిగా ప్రచురించాం.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ 1963 ఫిబ్రవరి 21వ తేదీన, మార్చి 30వ తేదీన వ్రాసిన రెండు లేఖలనుకూడా మేము పూర్తిగా ప్రచురించాం.

సోదరపార్టీలు మాపై దాడిచేస్తూ వ్రాసిన వ్యాసాలు, చేసినప్రసంగాలలో కొన్నిటికి మేము సమాధానాలు ఇచ్చాం; తక్కినవాటికి మేము ఇంకా సమాధానం ఇవ్వలేదు. ఉదాహరణకు, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ కామ్రేడ్స్ వ్రాసిన ఎన్నో వ్యా[illegible] లకు మేము ప్రత్యక్షంగా సమాధానం ఇవ్వలేదు:

1962 డిశంబరు 15, 1963 మార్చి 8 తేదీలమధ్య-మాపై దాడిచేసిన వారికి సమాధానంగా-మేము ఏడు వ్యాసాలు వ్రాశాం. అవి ఈ దిగువ శీర్షికలతో వెలువడ్డాయి.

"ప్రపంచ కార్మికులారా, ఏకంకండి. మన ఉమ్మడి శత్రువును వ్యతిరేకించండి !"

"కామ్రేడ్ టోగ్లియాటీకి, మాకూ మధ్య భేదాభిప్రాయాలు;"

"లెనినిజం, అధునిక రివిజనిజం";

"మాస్కో డిక్లరేషన్, మాస్కో స్టేట్‌మెంట్‌ల ప్రాతిపదికపై ఐక్యమవుదాం";

"భేదాభిప్రాయాలు ఎప్పటినుండి?—థోరే, తదితర కామ్రేడ్స్‌కు సమాధానం";

"కామ్రేడ్ టోగ్లియాటీకి, మాకు మధ్య భేదాభిప్రాయాలనుగూర్చి మరికొంత వివరణ - సమకాలిక ప్రపంచంలో లెనినిజానికి సంబంధించిన కొన్ని ప్రధాన సమస్యలు";

"అమెరికా కమ్యూనిస్టు పార్టీ ప్రకటనపై వ్యాఖ్య";

మార్చి 30 తేదీన మీ లేఖచివర, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీపై చైనాపత్రికలు "నిరాధారమైన దాడులు" చేస్తున్నాయని మీరు నిందించారండే, ఈ వ్యాసాలను దృష్టిలో పెట్టుకొనే నిందించారని ఊహించవలసివస్తున్నది. మాపై దాడిచేసినవారికి సమాధానంగా వ్రాసిన

వ్యాసాలను "దాడులు"గా వర్ణించడం విషయాలను తల్లక్రిందులు చేయడమే.

మా వ్యాసాలు "నిరాధారమైనవని," చాలా చెడ్డవని మీరు వర్ణిస్తున్నారు కాబట్టి, మేము మీ వ్యాసాలను ప్రచురించినట్లే ఈ ఏడు "నిరాధారమైనదాడుల"న్నిటినీ మీరుకూడా ప్రచురించి, ఒప్పెవరిదో తప్పెవరిదో [illegible] డానికి పరిశీలించడానికి సోవియట్ కామ్రేడ్స్‌కు, [illegible] శం ఎందుకు ఇవ్వకూడదు? "నిరాధారమైన [illegible] స్తున్న ఈ వ్యాసాలలో ఒక్కొక్క అంశాన్నే తీసుకొని దుయ్యబట్టే హక్కు మీకు ఉండనే ఉందిగదా.

మా వ్యాసాలు "నిరాధారమైనవ"ని, మా వాదనలు తప్పు అని మీరు పేర్కొంటున్నప్పటికీ, వాస్తవంలో మా వాదనలేవో మీరు సోవియట్ ప్రజలకు చెప్పడంలేదు. ఇది సోదరపార్టీలు లేవదీసిన సమస్యలను చర్చించడంపట్లగాని వాస్తవంపట్లగాని, ప్రజానీకంపట్లగాని తగు శ్రద్ధాసక్తులు చూపించేపద్ధతి అనిబొత్తిగా అనిపించు కోదు.

సోదరపార్టీలమధ్య బహిరంగ వాదోపవాదాలను కట్టిపెట్టగలరని మేము ఆశిస్తున్నాం. స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరపార్టీలమధ్య సంప్రదింపులద్వారా ఏకాభిప్రాయాన్ని సాధించడం అనే సూత్రాలను అనుసరించి పరిశీలింపదగిన సమస్య ఇది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో, ఎవరికీ తన ఇష్టంవచ్చినప్పుడు దాడులు ప్రారంభించే అధికారంగాని, రెండోపక్షంవారు సమాధానం ఇవ్వకుండా నిరోధించడానికై తన ఇష్టం వచ్చినప్పుడు "బహిరంగ వాదోపవాదాలను అంతం చేయాలని" ఉత్తర్వు ఇచ్చే అధికారంగాని లేదు.

సోదరపార్టీల సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి తగు వాతావరణాన్ని సృష్టించే నిమిత్తం, సోదరపార్టీల కామ్రేడ్స్ మాకు వ్యతిరేకంగా మాపేరెత్తి, మమ్ము ఉద్దేశించి చేసిన బహిరంగదాడులకు బహిరంగసమాధానాలు ఇవ్వడం 1963 మార్చి 9వ తేదీనుండి మేము తాత్కాలింగా ఆపుజేయ నిశ్చయించామనే విషయం సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు

పార్టీ కామ్రేడ్స్‌కు తెలిసే ఉంది. బహిరంగ సమాధానం ఇచ్చే హక్కును మేము అట్టిపెట్టుకొంటున్నాం.

మేము మార్చి 9వ తేదీన వ్రాసిన లేఖలో, బహిరంగవాదోపవాదాలను రద్దుచేసే సమస్యనుగూర్చి ఇలా చెప్పాం: "మన ఉభయపార్టీలు, ఇందుకు సంబంధించిన సోదరపార్టీలు కొంత చర్చ జరిపి, సర్వులకూ సమ్మతమైన ఆమోదకరమైన ఒడంబడికకు రావడం అవసరం.

*

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క సాధారణ పంథాను గూర్చి, అందుకు సంబంధించిన సిద్ధాంత సమస్యలనుగూర్చి మా అభిప్రాయాలను పైన పేర్కొన్నాం. ఈ లేఖ ప్రారంభంలో మేము సూచించినట్లు, మన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించుకోవడం పరస్పర అవగాహనకు తోడ్పడగలదని మేము ఆశిస్తున్నాం. కామ్రేడ్స్ ఈ అభిప్రాయాలతో ఏకీభవించనూవచ్చు, ఏకీభవించకపోనూవచ్చు. అయితే, మేము ఇక్కడ చర్చిస్తున్న సమస్యలు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ఎలుగెత్తి చాటుతున్న, పరిష్కారయోగ్యమైన కీలకసమస్యలని మా అభిప్రాయం. ఈ సమస్యలను, అలాగే మీ లేఖలో లేవదీసిన సమస్యలను అన్నిటినిగూర్చి మన ఉభయపార్టీల సంభాషణలలోను, అన్ని సోదర పార్టీల ప్రతినిధుల సమావేశంలోను పూర్తిగా చర్చించగలరని మేము ఆశిస్తున్నాము.

అంతేకాదు. అందరికీ సంబంధించిన ఇతర సమస్యలు, అంటే స్టాలిన్‌పై విమర్శ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి సంబంధించిన కొన్ని ప్రధానమైన సిద్ధాంత సమస్యలు ఉన్నాయి. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ 20వ మహాసభ, 22వ మహాసభలలో వీటిని లేవదీశారు. ఈ సమస్యలపై కూడా సంభాషణలలో ఒకరి అభిప్రాయాలను ఒకరు నిర్మొహమాటంగా వెల్లడించగలరని మేము ఆశిస్తున్నాం.

మన ఉభయపార్టీలమధ్య సంభాషణలను గూర్చి, మేము 9వ తేదీన వ్రాసిన లేఖలో, కామ్రేడ్ కృశ్చేవ్ పెకింగ్‌కు రావాలని మేము ప్రతిపా

దించాం ; ఇది అనుకూలంగా లేకపోతే, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీలో బాధ్యతగల మరొక కామ్రేడ్ నాయకత్వాన పెకింగుకు ఒక ప్రతినిధి వర్గాన్ని పంపాలని, లేదా మేము మాస్కోకు ఒక ప్రతినిధివర్గాన్ని పంపగలమని ప్రతిపాదించాం.

మీరు మార్చి 30వ తేదీన వ్రాసిన లేఖలో కామ్రేడ్ కృశ్చేవ్ చైనాకు [illegible] ఒక ప్రతినిధివర్గాన్ని పంపే కోరిక [illegible], చైనా కమ్యూనిస్టుపార్టీ కేంద్ర [illegible] ధి వర్గాన్ని మాస్కోకు పంప నిశ్చయించింది.

మీరు మార్చి 30వ తేదీ వ్రాసిన లేఖలో, సోవియట్ యూనియన్‌ను సందర్శించవలసిందిగా మీరు కామ్రేడ్ మావోసేటుంగ్‌ను ఆహ్వానించారు. ఫిబ్రవరి 23 ప్రాంతంలోనే, కామ్రేడ్ మావోసేటుంగ్ చైనాలో సోవియట్ రాయబారితో జరిపిన సంభాషణలో, ప్రస్తుతం తాను సోవియట్ యూనియన్‌ను సందర్శించడానికి ఎందుకు సిద్ధంగాలేరో తెలియజేశారు. మీకు ఈ విషయం బాగా తెలుసు.

చైనా కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీలో బాధ్యతగల ఒక కామ్రేడ్ మార్చి 9వ తేదీ చైనాలో సోవియట్ రాయబారికి స్వాగతం చెప్పిన సందర్భంలో, జూన్ మధ్యభాగంలో మేము ఒక ప్రతినిధివర్గాన్ని మాస్కోకు పంపుతామని మీకు తెలియజేశారు. తర్వాత, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థనను అనుసరించి, మేము మన ఉభయపార్టీల మధ్య సంభాషణలను జూలై 5వ తేదీకి వాయిదా వేయడానికి అంగీకరించాం.

చైనా, సోవియట్ పార్టీలమధ్య సంభాషణలవల్ల అనుకూల ఫలితాలు కలుగగలవని, అన్ని కమ్యూనిస్టు, వర్కర్సు పార్టీల సమావేశం ఏర్పాటుకు సన్నాహాలు చేసుకునేందుకు ఇది తోడ్పడగలదని మేము హృదయపూర్వకంగా ఆశిస్తున్నాం.

మార్క్సిజం-లెనినిజం, కార్మికవర్గ అంతర్జాతీయత, సోదరపార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించిన డిక్లరేషన్-స్టేట్‌మెంట్ ప్రాతిపదికపై కమ్యూ

నిస్టులందరూ ఐక్యంకావడం మునుపు ఎన్నడూ లేనంతగా ఇప్పుడు అవసరం.

మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలతో ప్రపంచమంతటాగల విప్లవ ప్రజలతో కలిసి చైనా కమ్యూనిస్టుపార్టీ సోషలిస్టు శిబిరంయొక్క, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క ప్రయోజనాలను, పీడితప్రజల, పీడితదేశాల యోగక్షేమాలను కాపాడటానికి, సా[illegible]వాదానికి వ్యతిరేకంగా పోరాట[illegible] జరపడానికి, ప్రపంచ శాంతిరక్షణ[illegible]


మనకు సన్నిహితులు, అభిమా[illegible] భవిష్యత్తు[illegible] కలిగించి, శత్రువుకు మాత్రమే సంతోషం కలిగించే ఘటనలు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో పునరావృతం కాబోవని మేము ఆశిస్తున్నాం.


మార్క్సిస్టు-లెనినిస్టులు, కార్మికవర్గం,సర్వత్రాగల విప్లవ ప్రజానీకం మరింత సన్నిహితంగా ఐక్యంకాగలరని, అన్ని కష్టాలను, అడ్డంకులను అధిగమించి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ప్రపంచశాంతి కోసం జరిగే పోరాటంలో, ప్రపంచ ప్రజల విప్లవాశయం కోసం, అంతర్జాతీయ కమ్యూ నిజంకోసం జరిగే పోరాటంలో ఇంకా గొప్ప విజయాలు సాధించగలరని చైనా కమ్యూనిస్టులు గట్టిగా విశ్వసిస్తున్నారు.

సకలదేశ కార్మికులారా, ఏకంకండి! ప్రపంచ కార్మికులారా, పీడిత ప్రజలారా, జాతులారా, ఏకంకండి! మనఉమ్మడి శత్రువును ఎదిరించండి!

విప్లవాభివందనాలతో,

చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ





64

Reply of Chinese Communist Party to the Letter of Soviet Party (14th June '63)
-A KRANTI FUBLICATION

Aug, '83
Rs. 1-50

కొత్త పుస్తకాలు

1\. [illegible] ఫాసిస్టు దాడిని ప్రజలు [illegible]

[illegible] నాయకత్వపు మితవాద అవకాశవాద దివాళాకోరు రాజకీయాలను ఓడించండి। (పార్టీ ప్రచురణ)

3\. పార్టీ నిర్మాణం —జె. వి. స్టాలిన్

4\. యుద్ధము - శాంతి —వి. ఐ. లెనిన్

5\. ఆచరణ —మావో-సే-టుంగ్

6\. పార్టీలో తప్పుడు అభిప్రాయాలను సరిదిద్దుట ,,

అచ్చులో....

- లాంగ్‌మార్చ్ (చైనా కథలు)
- వైరుధ్యాలు — మావో-సే-టుంగ్
- పురోగమిస్తున్న కరీంనగర్ రైతాంగ పోరాటం-ఎగిసివస్తున్న నిర్బంధపు కెరటం.

For Copies :

peace book centre
4-5-421, Sultan Bazar
HYDERABAD-500 001

Check List

Book Number	PSL09E401	Date	23/10/2022
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	C_I, 62, 63		
Missing Pages	NO		
Prepared By	Kyameema	Cutting By	Kyameema
Scanned By	Chayy	Pages	69